

# వైసీపీ నేతలు.. సొసైటీల్లో మేతలు!




## సొసైటీల్లో త్రిసభ్య కమిటీల అక్రమాలు

- జిల్లాలో అవినీతికి సహకారం
- త్రీమెన్ కమిటీల ఇష్టారాజ్యం
- వైసీపీ పాలనలో అంతా బొక్కుడే
- శ్రీరంగపట్నంలో బయటపడిన బాగోతం
- ప్రస్తుతానికి రూ.1.80 కోట్లు గల్లంతు
- కొనసాగుతున్న విచారణ
- కనిపించని లాకర్ తాళాలు
- ఇప్పటికే సెక్రటరీపై సస్పెన్షన్ వేటు
- జిల్లావ్యాప్తంగా 107 సొసైటీలు
- మిగిలిన సొసైటీల మాటేంటో?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో ఎటు చూసినా అవినీతి ఆనవాళ్లే.. ఐదేళ్లు భయపెట్టి.. సంక్షేమం ముసుగులో పాలన సాగించడంతో ఏ ఒక్కటీ బయటకు రాలేదు.. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. వైసీపీ పాలనలో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ సహకార పరపతి సంఘాలు అవినీతి కేంద్రాలుగా మారాయి. రూ.కోట్ల కుంభకోణాలు జరిగాయి.వెలుగులోకి వస్తున్న అవినీతి బాగోతాలు చూస్తుంటే నోరెళ్లబెట్టక తప్పనిపరిస్థితి. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో రూ.కోట్ల అవినీతి బయటపడింది.జిల్లాలో 107 సొసైటీలు ఉన్నాయి. రాజమహేంద్రవరం డివిజన్‌లో 48, కొవ్వూరు డివిజన్‌లో 59 ఉన్నాయి. ఎక్కువ సొసైటీలు అక్రమాల పుట్టలుగా తయారయ్యాయి. రైతులు, ప్రభుత్వాలను మోసం చేస్తూ సొసైటీ పాలకవర్గాలు, సొసైటీ సీఈవో (సెక్రటరీ)తో కుమ్మక్కయ్యి రూ.కోట్లు దోచేస్తున్నారు. అసలు లాభం అనేదే చూపకుండా నష్టాలు చూపిస్తున్నారు. సహకార వ్యవస్థ మొత్తం ఇలానే ఉంది.

### రైతులు చెల్లించారు.. నేతలు బొక్కేశారు..

గ్రామాల పరిధిలో ఉన్న వ్యవసాయ భూములకు సొసైటీల ద్వారా రుణాలు ఇస్తారు.అయితే ఈ సొసైటీలో ఇతర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు రుణాలు తీసుకున్నారు. వాస్తవానికి సొసైటీ పరిధిలో భూములు ఉండి, వాటి యజమానులు ఏ ప్రాంతంలో ఉన్నా రుణాలు తీసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.కానీ సరైన డాక్యుమెంట్లు చూపకుండా రుణాలు ఇవ్వడం, రుణాలు ఇచ్చినందుకు లంచాలు తీసుకోవడం ఎక్కడైనా జరుగుతుంటుంది. కానీ ఈ సొసైటీ ద్వారా రుణాలు పొందిన వ్యక్తుల నుంచి రికవరీ చేసి దానికి సంబంధించిన డాక్యుమెంట్లు రైతులకు ఇచ్చేశారు.కానీ రైతులు రుణాలు చెల్లించినట్టు సొసైటీలో ఆధారాలు లేవు. రైతుల పేరిట అప్పులు చూపిస్తున్నారు. రైతులకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇచ్చేయడంతో ఇబ్బంది లేదు. రుణాలకు చెల్లించిన డబ్బంతా సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు, సీఈవో, సిబ్బంది తినేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.ప్రస్తుతం రికార్డులు, క్యాష్ బుక్‌లు లెడ్జర్లు,వోచర్లు వంటివి ఏమీ లేవు. దీంతో అధికారులు రైతులవారీ తిరిగి విచారణ చేస్తుండడంతో బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక శ్రీరంగపట్నం సొసైటీలో మొదటి త్రిసభ్య కమిటీ.. వైసీపీ నాయకుడు అత్తిలి రాంప్రసాద్ చైర్మన్‌గా, నండూరి నాగేశ్వరరావు, సింగంపల్లి శ్రీనివాస్ సభ్యులుగా ఉండేవారు. అప్పుడు సెక్రటరీ(సీఈవో)గా ఎం.శ్రీనివాసరావు ఉండేవారు. ఆ సమయంలోనే ఎక్కువ అవినీతి జరిగినట్టు తెలుస్తోంది. తర్వాత బుద్దా శ్రీనివాస్ చైర్మన్‌గా తనకాల ప్రసాద్, డేగల నాగేశ్వరరావు సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం విచారణ జరిపిస్తోంది. ఇక్కడ అవినీతి మరింత పెరిగే అవకాశం ఉంది.

### నీరుగారుతున్న ఆశయం..

రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చి, పోత్సహించడానికి,లాభాల్లో డివిడెండ్లను కూడా రైతులకు పంచడానికి సొసైటీలు పనిచేయాలి. ఎరువులు,విత్తనాలు అమ్మడం, ధాన్యం కొనుగోలు చేయడం వంటివి కూడా సొసైటీలు చేస్తుంటాయి. రైతులకు గ్రామాల్లో అందు బాటులో ఉండడం, రైతులు పంటలు పండించడానికి అవసరమైన పెట్టుబడి కోసం రైతుల భూములను తాకట్టు పెట్టుకుని రుణాలు ఇస్తుండాలి. గతంలో కొన్ని సొసైటీలు బాగా పనిచేసేవి. వచ్చిన లాభాల్లో రైతులకు డివిడెండ్లను ఇచ్చేవి. అయితే వైసీపీ పాలనలో అసలు సొసైటీ ఎన్నికలే జరగలేదు..ఐదేళ్లూ త్రీమెన్ కమిటీలతోనే నడిపించారు. ఎంతో ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన సొసైటీలు వైసీపీ పాలనలో నామినేటెడ్ పదవులకు కేంద్రాలుగా మారాయి. కనీస అవగాహన లేని వారే త్రీమెన్ కమిటీల్లో ఉండడంతో సొసైటీల నుంచి రైతులకు అందిన సాయం సున్నా.

### జిల్లాలో 107 సొసైటీల్లోనూ ఇంతే?

జిల్లాలోని 107 సొసైటీలు అక్రమాలకు కేంద్రాలుగా మారిపోయాయి. సొసైటీలు అంటేనే దోచుకోవడానికి తప్ప, రైతులకు ఉపయోగపడేవిగా ఇవి పనిచేయడంలేదు.పైగా ఇందులో రాజకీయనేతలు కూడా కుమ్మక్కయి ఉండడం వల్ల విచారణ జరగడమే కానీ రికవరీలు కనిపించడంలేదు. మహా చేస్తే పాలకవర్గాన్ని తిరిగి పోటీ చేయకుండా చేస్తున్నారు.అధికారులను సస్పెండ్ చేస్తున్నారు.వాళ్లు తిరిగి ఏదో విధంగా మళ్లీ అధికారంలోకి వచ్చి, మళ్లీ అవినీతి ఆరంభిస్తున్నారు. వీటికి క్రిమినల్ చర్యలు ఉండడం, అవినీతి సొమ్మును రికవరీ చేయడం వంటివి పటిష్టంగా,కఠినంగా ఉంటే సొసైటీలు ఉపయోగకరంగా మారవచ్చు.చర్యలు లేకపోవడం వల్ల రైతుల సొమ్ము,ప్రభుత్వానికి అందాల్సిన సొమ్ము ఆయా ప్రాంతాల నేతలే బొక్కేసి సొసైటీలు నిర్వీర్యం చేస్తున్నారు.

### శ్రీరంగపట్నంలో రూ.2 కోట్లు పక్కదారి?

కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సొసైటీ టర్నోవర్ సుమారు రూ.11 కోట్లకు పైగా ఉంటుంది. 1932 ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ సొసైటీలో పరిసర గ్రామాలకు చెందిన 1994 ప్రాంతంలో సొసైటీలో విలీనమయ్యాయి.సొసైటీ పరిధిలో శ్రీరంగపట్నం, బొల్లెద్దు పాలెం, కోటి, కోటి-కోటికేశవరం, రాఘవాపురం, గరగ పాలెం గ్రామాలు ఉన్నాయి.వాటి పరిధిలో 2,424 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. కనీసం నిబంధన ప్రకారం రూ.300 షేర్‌ధనం ఉన్న సభ్యులు సుమారు 1400 మంది వరకూ ఉంటారు. సొసైటీలకు చాలా కాలం నుంచి ఎన్నికలు జరగడంలేదు. గత 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ నేతలతో త్రిసభ్య కమిటీలను నియమించింది.ఈ ఐదేళ్లలో రెండు త్రిసభ్య కమిటీలు పనిచేశాయి. ఇటీవల టీడీపీ అధికారంలోకి రావడంతోనే వాటిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. 2019 నుంచి 2023 వరకూ ఇక్కడ రూ.2 కోట్లకు పైగా అవినీతి జరిగినట్టు తెలుస్తోంది.జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు ప్రస్తుతం 51ఎ ఎంక్వయిరీ నడుస్తోంది.ఇప్పటికే .రూ.కోటి 80 లక్షల అవినీతి బయటపడింది.దీనికి బాధ్యుడిని చేస్తూ ఇప్పటికే సీఈవో శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు.విచారణ చేసే కొద్దీ అవినీతి బయటపడుతోంది. రైతులకు రుణాలివ్వడంలోనూ అవకతకలు జరిగాయి.

### బంగారం లాకర్ కీ ఎక్కడ?

ఐదేళ్లూ వైసీపీ నాయకుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. శ్రీరంగపట్నం పాత సొసైటీ భవన స్థలం కనీస అనుమతుల్లేకుండా సచివాలయానికి ఇచ్చేశారు. ఆ స్థలంలో సచివాలయం నిర్మించేశారు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ నిమిత్తం అనధికారికంగా సొసైటీ నుంచి రూ.75 లక్షలు బిల్లులు చేసినట్టు సమాచారం. సొసైటీ నుంచి బిల్లులు చేయడం ఉండదు. అయితే ఈ సొసైటీ నుంచి బిల్లులు చేయడం గమనార్హం. బంగారం లాకర్ కీ కూడా కనిపించడంలేదు. ఆ తాళం సొసైటీ సెక్రటరీ వద్ద ఉన్నట్టు సమాచారం.



పవన్ క్యాంపు ఆఫీస్ ఎదుట రాజమండ్రి మహిళ ఆత్మహత్యాయత్నం

## స్థలం సమస్య తీరుస్తారా.. చచ్చిపోమంటారా?

- పవన్ క్యాంపు ఆఫీస్ వద్ద ఆత్మహత్యాయత్నం
- మహిళను అడ్డుకుని రక్షించిన పోలీసులు
- దంపతులు పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- వైసీపీ కార్పొరేటర్ వేధింపులతోనేనని వెల్లడి
- తమ భూమిని ఆక్రమించినట్టు ఆరోపణ
- రాజమహేంద్రవరానికి చెందిన వారిగా వెల్లడి

విజయవాడ/రాజమహేంద్రవరం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల భూదాహం, వేధింపులతో విసిగిపోయిన ఓ మహిళ విజయవాడలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయం వద్ద ఆత్మహత్యకు యత్నించారు.మంగళవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.ఈ ఘటనపై రెండు భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. రాజమహేంద్రవరంలో 1,200 గజాల స్థలం ఉందని మేడిశెట్టి రాంబాబు, దుర్గాదేవి దంపతులు చెబుతున్నారు. దీన్ని వైసీపీ మహిళా కార్పొరేటర్ ఆక్రమించుకున్నారని దుర్గాదేవి ఆరోపిస్తున్నారు. సీఎం చంద్రబాబుకు తమ సమస్యను విన్నవించుకోవడానికి విజయవాడ వచ్చినట్టు చెప్పారు. అయితే పోలీసులు అడ్డుకోవడంతో ఆయన్ను కలవలేకపోయామన్నారు. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం వద్దకు వస్తే అక్కడా పోలీసులు అడ్డుకున్నారు. అప్పాయింట్‌మెంటు ఉండాలని సూచించారు. దీంతో దుర్గాదేవి క్యాంపు కార్యాలయానికి ఎదురుగా ఉన్న పోలీసు క్వార్టర్స్ భవనం ఎక్కి దూకేసేందుకు ప్రయత్నించారు.గమనించిన పోలీసులు వెంటనే ఆమెను భవనంపై నుంచి కిందికి తీసుకొచ్చారు. అనంతరం దంపతులను సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహిళా కార్పొరేటర్ ఓ దళారీ ద్వారా తమ స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రాజమహేంద్రవరం పోలీసులపై నమ్మకం లేదని, సీఎం చంద్రబాబును కలిసి గోడు వెళ్లబోసుకోవాలని వచ్చినట్టు వివరించారు.

### స్థలం రాజమండ్రిలో కాదు..రాజాంలో : పోలీసులు

అయితే రాజమహేంద్రవరం పోలీసులు మాత్రం మరో విధంగా చెబుతున్నారు.రాజమహేంద్రవరానికి చెందిన మేడిశెట్టి రాంబాబు దంపతులు ప్రస్తుతం కాకినాడలో నివాసం ఉంటున్నారని తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్యాపురంలో సుమారు 30 గజాల్లో పాడుబడిన పెంకుటిల్లు ఉందని చెప్పారు. ఆ ఇంటి విషయమై సోదరుల మధ్య వివాదం ఉండగా కోర్టు ద్వారా రాంబాబుకే దక్కిందన్నారు. అయితే దంపతుల చెబుతున్న స్థలం 1200 గజాలు రాజమహేంద్రవరంలో కాదని శ్రీకాకుళం జిల్లా రాజాంలో ఉన్నట్టు చెబుతున్నారు. రాంబాబు భార్య దుర్గాదేవికి ఆమె తల్లిదండ్రులు ఇచ్చినట్టు ఆమె చెప్పిందని పేర్కొంటున్నారు. రాజాంలోని స్థలం అక్కడ వైసీపీ నాయకుడు ఆక్రమించడంతో తేల్చాలని రాంబాబు, ఆయన భార్య గతంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చారన్నారు.ఈ ఘటనపై గతంలో హైకోర్టు వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కోర్టు ఆదేశాలతో 2023 మార్చిలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆ కేసు పెండింగ్‌లో ఉంది. కాకినాడ కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నం చేసినట్టు సమాచారం.రాజమండ్రిలోని ఇంటికి సంబంధించి ఆమె ఆత్మహత్యాయత్నం చేయలేదని, రాజాంలో స్థలం కోసం చేసి ఉంటారని స్థానిక పోలీసులు వెల్లడించారు. భార్యాభర్తలు మానసికంగా అసమతుల్యంగా ఉన్నారని పేర్కొన్నారు.

1 నుంచి పవన్ పర్యటన 7
29 నుంచి 'సుప్రీం' లోక్ అదాలత్ 8



జిల్లా ఆసుపత్రిలో చిన్నారిని ముద్దాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

## జీజీహెచ్ వైద్య సేవల్లో తేడా వస్తే ఊరుకోను

- నెలకూ రెండు సార్లు తనిఖీ చేస్తా
- జిల్లా ఆసుపత్రి పరిశీలనలో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 25 : ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆదేశించారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో మంచి వైద్యం అందుతుందని దూరప్రాంతాల నుంచి ఎంతో నమ్మకంతో వచ్చే పేదలు, మధ్యతరగతి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలందించాలన్నారు. ఎక్కడైనా తేడా వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జీజీహెచ్‌లో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. ఓపీ రోగుల విషయంలో రిజిస్ట్రేషన్లు ఆలస్యం కావడం సరికాదని, ఆన్‌లైన్ కోసం సర్వర్ పనిచేయకపోతే మాన్యువల్‌గా రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలన్నారు.పేపర్‌మిల్లు, ఇతర సంస్థల సహకారంతో సీఎస్ఆర్ నిధులు తీసుకొచ్చి టెస్టింగ్, ఇతర వైద్య పరికరాలకు కొరత లేకుండా చూస్తామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రభుత్వాసుపత్రికి వచ్చి రోగులకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయో పరిశీలిస్తామని, రోగుల సమస్యలు తెలుసుకుంటామని ప్రకటించారు. జీజీహెచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నా రిలీవ్ చేయడంలేదని, వెంటనే తమకు పోస్టింగ్‌లు ఇప్పించాలని నర్సింగ్ ఉద్యోగినులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కోరగా వెంటనే ఆయన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడి విషయం వివరించారు. ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది తమ జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.ఓపీ విభాగంలో పనిచేస్తున్న డీఈవోలు తమకు ఉద్యోగభద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ, డిప్యూటీ సూపరింటెండెంట్ కృష్ణంరాజు, ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మరుకుర్తి రవియాదవ్, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, యండమూరి దీపు, దాస్యం ప్రసాద్, నాయకులు బేసరి చిన్ని, నాగలక్ష్మి, మంత్రమూర్తి రాంబాబు, జగదీష్, కాశీ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

### రోగులతో మాట్లాడిన వాసు..

ఓపీ, సీటీ స్కాన్, వార్డులు, ఎంసీహెచ్ బ్లాకుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. పలువురు రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవజాత శిశువుల ఆరోగ్య పరిస్థితులను ఆరా తీసి వారి కుటుంబీకులతో మాట్లాడారు. రోగులకు అందజేసే ఆహార పదార్థాలను పరిశీలించి వాటిని రుచి చూశారు. ఆసుపత్రిలో పాలనాపరమైన చిన్నపాటి లోపాలు ఉన్నాయన్నారు. కొంత సమన్వయం కొరవడిందని, వాటన్నింటినీ పరిష్కరించుకుంటూ వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.ఆసుపత్రి అవసరాలకు తగ్గట్టుగా వైద్య సిబ్బంది నియామకం విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. మాజీ సీఎం జగన్ ప్యాలెస్‌ల పిచ్చి పరాకాష్టకు చేరిందని, వైసీపీ పార్టీ కార్యాలయాల పేరుతో జిల్లాకో ప్యాలెస్ కట్టడమే దీనికి నిదర్శనమన్నారు.

## కూటమిగా.. శ్రమదానం

గత వైసీపీ పాలకులను సమస్యను పరిష్కరించమని ఐదేళ్లూ అడుగుతూనే ఉన్నారు.. అయినా పరిష్కారం లేదు.. ప్రమాదాలు జరుగుతున్నాయన్నా పట్టించుకున్న వాడూ లేడు.. అయితే కూటమి నాయకులకు ప్రజానీకం సమస్యను విన్నవించారో లేదో.. తెల్లవారేసరికి పరిష్కరించారు..శెహబాస్ అనిపించుకున్నారు.. నిడదవోలు నరసాపురం రోడ్డు నుంచి పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామంలోకి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉండవలసిన కల్వర్టు లేకపోవడంతో తరచూ పలు ప్రమాదాలు జరిగాయి.
ఈ సమస్యను గ్రామస్తులు కూటమి నాయకులకు తెలిపారు. దీనిపై స్పందించిన నాయకులు మంగళవారం ఉదయం నుంచి శ్రమదానం చేసి కల్వర్టు నిర్మించారు. సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రజానీకం అభినందించారు. -పెరవలి



కూటమి నాయకులు శ్రమదానంతో నిర్మించిన కానూరు అగ్రహారం కల్వర్టు..



కల్వర్టు వద్ద శ్రమదానం చేస్తున్న నాయకులు

## కదలరు.. సీటు వదలరు!



### కంట్రోల్ తప్పుతోన్న రాజమహేంద్రవరం కార్పొరేషన్

- 20 ఏళ్లు పైబడి ఒకే సీటులో తిష్ట
- పాతుకుపోయిన ఉద్యోగులు
- ఇష్టారాజ్యంగా మారిన వైనం
- బదిలీలు లేకపోవడమే కారణం
- ఒక్క రాజమండ్రిలోనే 80 మంది
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్
- గతంలో బదిలీల జీవోకు యత్నం
- ప్రభుత్వం మారడంతో కదలని ఫైలు
- ఈ సారైనా కదులుతుందని ఆశ

**నాకు కార్పొరేషన్‌లో పని ఉండి ఒక ఉన్నతాధికారిని కలిశా.. పనిపూర్తవలేదు.. అయితే ఒక కిందిస్థాయి ఉద్యోగిని కలిశా.. నా పనికో రేటు చెప్పాడు.. అది చెల్లించా నా పనిపూర్తయిపోయింది.. ఎందుకంటే అక్కడ ఆయన 20 ఏళ్లుగా పనిచేస్తున్నాడు.. కార్పొరేషన్‌కు సంబంధించి మనకు ఒక చానల్ దొరికింది.. ఏ పనైనా ఇట్టే చక్కబెట్టేస్తాడు.. ఇదీ ఒక ఒక వ్యక్తి చెప్పిన మాట.. నిజమే మరి.. 20 ఏళ్లుగా ఒక చోటే పనిచేస్తుంటే చక్రం తిప్పక మరేం చేస్తాడు... ప్రస్తుతం రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో ఇదే పరిస్థితి.. బదిలీలు లేకపోవడంతో సుమారు 80 మంది అక్కడే తిష్టవేసి అంతా మా ఇష్టం అంటున్నారు.. ఏమైనా అంటే లోకల్ అంటున్నారు.. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.**

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 25 : పాలకులు మారతారు..ఉన్నతాధికారులు మారతారు.. కొంత మంది అధికారులు మాత్రం పాతుకుపోయారు..కుర్చీలకు అతుక్కుపోయారు.. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 20 ఏళ్లగా ఇదే పరిస్థితి.. ఎవరు చెప్పినా వినరు.. వారు చెప్పిందే వినాలి. ఎందుకంటే సీటుబలం.. కనీసం ఉన్నతాధికారుల మాటను లెక్కచేయరు.. ఇదీ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో దుస్థితి.

### కార్పొరేషన్‌లో 300 మంది సిబ్బంది..

కార్పొరేషన్‌లో చాలా మంది ఉద్యోగులు ఏళ్లతరబడి ఎటువంటి బదిలీలు లేకుండా పాతుకుపోయారు. ప్రభుత్వాలు మారినా..పాలక మండళ్లు మారినా.. ప్రజాప్రతినిధులు మారినా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో పనిచేసే కొంత మంది ఉద్యోగులు మాత్రం ఇక్కడ జాయినై ఇక్కడే ఉండిపోయారు. నగరపాలక సంస్థలో మొత్తంగా 300 మంది సిబ్బంది ఉంటారు. వీరిలో సుమారుగా 20 ఏళ్లుగా 30 మంది.. గత పది.. పదిహేనేళ్లుగా 50 మంది పాతుకుపోయారు..కనీస బదిలీలు కూడా వీరికి లేకపోవడంతో కార్పొరేషన్‌లోనే విభాగాలు మారుతూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఆయా విభాగాల హెచ్‌వోడీలుగా ఉండే 10 మంది మాత్రమే ఇతర మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు బదిలీ అవుతుంటారు. హెచ్‌వోడీలు మారినా స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న కిందిస్థాయి సిబ్బందికి బదిలీలు లేకపోవడంతో వచ్చిన ఉన్నతాధికారులు వారినే ఫాలో అవుతుంటారు.దీంతో అధికారం ఇష్టారాజ్యంగా మారుతోంది.

### కార్పొరేషన్ టు కార్పొరేషన్ బదిలీల్లేవ్..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆర్‌వోలు, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, గుమస్తాలకు బదిలీలులేవు. దీంతో ఏళ్ల తరబడి ఉద్యోగులు నగరపాలక సంస్థల్లో తిష్ట వేసుకుని కూర్చున్నారు.కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లు,డిప్యూటీ కమిషనర్లు, ఎస్ఈలు, సీపీలు, ఏసీపీలు ఈఈలు, డీఈలకు మాత్రమే బదిలీ ఉంటుంది.ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ విభాగాల్లో హెచ్‌వోడీలుగా ఉన్నవారికి మాత్రమే బదిలీలు ఉంటాయి. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కొంత మంది బదిలీలు వచ్చినా వెళ్లకుండా గతంలో నిలుపుదల చేయించుకున్నారు. కొంత మంది ఉద్యోగులు 20 ఏళ్లగా ఒకే సీటుకు పరిమితమై చక్రం తిప్పుతున్నారు. కార్పొరేషన్‌లో బదిలీలు ఉన్నా కార్పొరేషన్ లోపల విభాగాల్లో సీట్లు మారతారు తప్ప వేరొక చోటుకు బదిలీ ఉండకపోవడంతో ఆడిందే ఆట అన్న చందాన కార్పొరేషన్‌లో కొంత మంది ఉద్యోగుల తీరు ఉంది. సీనియర్ అసిస్టెంట్స్, ఆర్‌వోలు, ఆర్ఐలు, అకౌంటెంట్, ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగుల బదిలీలకు చోటే లేకుండా పోయింది. చాలా వరకు కారుణ్య నియామకాలు ఉన్నాయి. ఇక్కడే ఉద్యోగంలో చేరిన వారు ఇక్కడే పదవీ విరమణ పొందే పరిస్థితి ఉంది. దీంతో ఇష్టానుసారం పనిచేస్తున్నారు. అనేక ఆరోపణలు ఉన్న ప్పటికి ఏమీ చేయలేని పరిస్థితి ఉంది.ఈ జాబితాలో గత ఐదేళ్లుగా వైసీపీ ప్రజాప్రతినిధులతో అంటకాగిన కార్పొరేషన్ సిబ్బంది చాలా మంది ఉన్నారు. కానీ ఇక్కడ బదిలీలు లేక ప్రక్షాళన సాధ్యం కావడంలేదు.

### గతంలో బదిలీ జీవో తేవాలని యత్నం..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న హెచ్‌వోడీలు మినహా మిగిలిన కీలకమైన స్థానాల్లో పనిచేస్తున్న అధికారులు, గుమస్తాలకు బదిలీలు లేవు. దీంతో కార్పొరేషన్‌లో ప్రక్షాళన జరగడంలేదని గుర్తించిన గత మేయర్ పంతం రజనీ శేషసాయి కార్పొరేషన్ నుంచి కార్పొరేషన్‌కు కొంత మందిని బదిలీ చేసే జీవో తీసుకురావాలని ప్రయత్నించారు. అప్పటి పురపాలక శాఖమంత్రి నారాయణతో పాటు డీఎంఏను కలిసి రిప్రజెంటేషన్ ఇచ్చారు.అటుపై ప్రభుత్వం మారడంతో కార్యరూపం దాల్చలేదు.ఎప్పట్నుంచో కీలకస్థానాల్లో ఉన్న వారిని బదిలీ చేయాలనే ఆలోచన ముందుకు సాగలేదు.

### పాలకుల ప్రసన్నంతో సరి..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో తిష్ట వేసుకుని ఉన్న కొంతమంది ఉద్యోగుల బదిలీలు ఈ సారైనా సాధ్యమా అనే అనుమానాలు కలుగుతున్నాయి. కార్పొరేషన్‌లో కీలకస్థానాల్లో ఉన్న కొంత మంది ప్రభుత్వాలు మారినప్పుడల్లా వారి సీటు పదిలం చేసుకుంటున్నారు. ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుని వేటు పడకుండా జాగ్రత్త పడుతున్నారు. అయితే ప్రజలకు మెరుగైన సేవలందించే క్రమంలో కూటమి ప్రభుత్వం ఎటు వంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి. నిస్వార్థంగా ప్రజలకు సేవలందించే ఉద్యోగులతో ఆ విభాగం ప్రగతి పథంలో ఉంటుంది.కానీ పైరవీలకు పాల్పడే అక్రమార్కులను సంస్కరించకపోతే ఆ ప్రభావం ప్రభుత్వం పై పడే ప్రమాదం ఉంది. కార్పొరేషన్ నుంచి వేరొక కార్పొరేషన్‌కు ఉద్యోగులను బదిలీలు చేసేవిధంగా జీవోను తీసుకువచ్చి ప్రక్షాళన చేస్తుందా. లేక పాతవిధానంలోనే ముందుకు సాగుతుందా చూడాల్సి ఉంది.

# 1వ తేదీ నుంచి పవన్ పిఠాపురం పర్యటన

### ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం

పిఠాపురం, జూన్ 25: పిఠాపురం అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయిన తర్వాత జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తొలిసారి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన అధికారికంగా ఖరారయింది. ఈ వివరాలను జనసేన కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం రాత్రి పత్రికలకు తెలియజేశారు. జూలై 1వ తేదీ నుంచి పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న పవన్ అదే రోజు సాయంత్రం పిఠాపురంలో వారాహి సభ నిర్వహిస్తారు. తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తారు. మూడు రోజులు పాటు పిఠాపురం నియోజకవర్గంతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగే పలు అధికారిక కార్యక్రమాల్లో పవన్‌కల్యాణ్ పాల్గొననున్నారు. కాకినాడ జిల్లా అధికారులు, పిఠాపురం నియోజకవర్గంలోని అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షిస్తారు. పిఠాపురం నియోజకవర్గంలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా సమావేశం కావాలని పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. పవన్ పర్యటన అధికారికంగా ఖరారు కావడంతో అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయింది. పవన్‌కు భారీగా స్వాగతం పలికేందుకు జనసేనతో పాటు టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసైనికులు, వీరమహిళలు సన్నద్ధమవుతున్నారు.


వారాహి పూజలో పవన్‌కల్యాణ్



## డీజీపీని కలిసిన పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జూన్ 25: రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) గా బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యే పంతం నానాజీ మంగళగిరి రాష్ట్ర పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీకి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నానాజీని డీజీపీ ద్వారకా తిరుమలరావు అభినందించారు.

## పలు రైళ్ల పునరుద్ధరణ

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చాగల్లు-రాజమండ్రి సెక్షన్‌లో మరమ్మతుల నిమిత్తం ఈ ఏడాది సెప్టెంబరు 16 నుంచి అక్టోబరు 15 వరకూ తాత్కాలికంగా రద్దు చేసిన 12 రైళ్లు ఆయా తేదీల్లో యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. చాగల్లు- రాజమండ్రి సెక్షన్‌లో మరమ్మతుల నిమిత్తం 12 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వాటి తాత్కాలిక రద్దును నిలిపివేసినట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ నుస్రత్ ఎం.మండ్రూప్‌కర్ తెలిపారు. 07466, 07467 రాజమండ్రి-విశాఖ-రాజమండ్రి, 17257, 17258 విజయవాడ-కాకినాడ-విజయవాడ, 17219, 17220 మచిలీపట్నం-విశాఖ-మచిలీపట్నం, 17239, 17240 గుంటూరు-విశాఖ-గుంటూరు, 22702, 22701 గుంటూరు-విశాఖ-గుంటూరు, 22708, 22707 తిరుపతి-విశాఖ-తిరుపతి రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయన్నారు. అయితే నిడదవోలు-సామర్లకోట సెక్షన్ల నడుమ ఈ నెల 24 నుంచి ఆగస్టు 10 వరకూ రద్దు చేసిన 26 రైళ్లలో జన్మభూమి, సర్కారు మాత్రమే పునరుద్ధరించారు. మిగతా రైళ్లు తాత్కాలిక రద్దు జాబితాలోనే ఉన్నాయి.

### అన్న క్యాంటీన్ పునరుద్ధరించాలని మంత్రి నారాయణకు యనమల లేఖ

తుని రూరల్, జూన్ 25: తునిలో అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించాలని పురపాలక శాఖ మంత్రి నారాయణకు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు మంగళవారం లేఖ రాశారు. తునిలో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ను వైసీపీ ప్రభుత్వంలో మూసివేశారని, పునరుద్ధరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అన్న క్యాంటీన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లేఖలో యనమల కోరారు.

### అన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం

అయినవిల్లి, జూన్ 25: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక అన్నదాన ట్రస్టుకు రమణ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత రాయుడు రమణమూర్తి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రూ.50 వేలు విరాళం అందజేశారు.

### నిత్యాన్నదానానికి విరాళాలు

అంతర్వేది, జూన్ 25: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి మంగళవారం పాలెపు బేబి అన్నపూర్ణ, కుటుంబ సభ్యులు రూ.58వేలు విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఐవీ కృష్ణమూర్తి, లక్ష్మణరావు రూ.40వేలు విరాళంగా ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించినట్టు దాతలు తెలిపారు. విరాళ దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

### వెంకన్న ఆదాయం రూ.1.73 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 25: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,73,610 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.


కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు

# అభివృద్ధిలో భాగస్వాములవుతాం

### కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కలిసిన జేఏసీ నేతలు

కాకినాడ సిటీ, జూన్ 25: జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులందరూ భాగస్వామ్యం అవుతామని, జిల్లా నూతన కలెక్టర్‌కు సహకరిస్తామని ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా చైర్మన్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్ అన్నారు. కాకినాడ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సగిలి షణ్మోహన్‌ను మంగళవారం అసోసియేషన్ జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగానికి అమరావతి జేఏసీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగులందరూ నియమ నిబద్ధతతో పనిచేయాలని, అందుకు ఉద్యోగులకు తగినంత స్వేచ్ఛ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ దుర్గాప్రసాద్, ఏపీ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్, కలెక్టరేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివ, ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ సంఘాల నాయకులు ప్రసాద్, దీపిక, రమ్య, చంద్రశేఖర్, రఘు, రామకృష్ణ, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఈ తిండి తినేదెలా?


ఆహారాన్ని పడేస్తున్న చిన్నారులు

- మధ్యాహ్న భోజనంలో ఉడకని పులిహోర
- ముద్ద నోట్లో పెట్టుకోలేకపోయిన పిల్లలు
- చెత్తబుట్టలో పడేసిన వైనం


ఆహార పదార్థాలను పడేస్తున్న దృశ్యం

అమీనబాద్(కొత్తపల్లి), జూన్ 25:ముద్దయిపోయిన పులిహోర, అన్నం తినలేక విద్యార్థులు అసహనానికి గురై చెత్తబుట్టలో పడేశారు. అమీనాబాద్ సాలిపేట ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. ప్రతీరోజూ ప్రభుత్వ పాఠశాలలకు సెంట్రల్ కిచెన్ విధానంలో మధ్యాహ్న భోజనం పంపిణీ చేస్తారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం పాఠశాలకు పంపిణీ చేసిన అన్నం, పులిహోర చిమిడిపోయింది. ఉండలుగా ఉండటంతో విద్యార్థులు తినలేక పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన చెత్త డబ్బాలో వేశారు. పాఠశాలలో అన్నం తినకుండా పలువురు విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తరచూ పాఠశాలకు పంపిణీ చేస్తున్న మధ్యాహ్న భోజనం రుచి,శుచి నాణ్యత లేకుండా ఉంటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో ఒక మూల తెల్లవారకుండా భోజనాలు తయారు చేస్తూ అవి పాఠశాలకు వచ్చే సమయంలో పాడవుతున్నాయని వాపోయారు. ఉడికీ ఉడకని అన్నం, రుచిలేని సాంబారుతో భోజనం చేసిన తమ పిల్లలు అనారోగ్యాలకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన రుచికరమైన భోజనాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

### పంపా వరద గేట్లకు మరమ్మతులు

అన్నవరం, జూన్ 25: రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని పంపా వరద గేట్ల మరమ్మతులను ఇరిగేషన్ అధికారులు ఏజెన్సీ ద్వారా తాత్కాలికంగా చేపడుతున్నారు. పూర్తిస్థాయి పనులకు సుమారు రూ.30 లక్షలు అంచనా వ్యయం అవుతుందని లెక్కగట్టినా నిధుల లేమితో అత్యవసర పనులను చేపడుతున్నారు. ప్రధానంగా రిజర్వాయర్‌లో నీటిమట్టం గరిష్ఠంగా చేరితే గేట్లు ఎత్తడం, దించడం కష్టతరంగా ఉంటుండంతో గేట్లకు గ్రీజింగ్ చేపట్టి తుప్పుపట్టిన ప్రదేశంలో ముక్కలను తొలగించి కొత్తవాటితో వెల్డింగ్ ప్రక్రియ చేస్తున్నారు. అదే విధంగా పలుచోట్ల బోల్టులు లూజు కావడంతో వాటిని అమర్చుతున్నారు. నిధులు విడుదల అయితే పూర్తిస్థాయిలో పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.


మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

# వ్యవసాయ రంగం వైపు మళ్లించేందుకు కసరత్తు

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 25: యువతను వ్యవసాయ రంగం వైపు మళ్లించేందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి కసరత్తు చేస్తున్నట్టు ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ గౌతమ్ అన్నారు. స్థానిక సీటీఆర్ఐలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ , తమిళనాడు, పాండిచ్చేరి పరిధిలో గల కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే) జోన్ 10వ వార్షిక జోనల్ సమీక్ష సమావేశాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజుల పాటు వర్క్ షాపు జరుగుతుందన్నారు. దేశంలో 731 కేవీకేలు ఉన్నాయని, వీటికి కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆధారం చేసుకుని వీటి ద్వారా ఎప్పటికప్పుడు నూతన పరిశోధనల, మార్కెటింగ్, సాంకేతిక పరిజ్ఞానం, మేలైన వంగడాలు అందించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. దేశంలోని మూడు జోన్స్‌లో దాదాపు ఎనిమిది వేల హెక్టార్లలో 300 డ్రోన్స్‌ని ఉపయోగించి పురుగుల మందు జల్లడం వంటి పనులకు సంబంధించి ప్రదర్శనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎం.శేషుమాధవ్,షేక్ ఎస్.మీరా, సీటీఆర్ఐ అధికారులు పాల్గొన్నారు.


సీటీఆర్ఐలో విలేకరులతో మాట్లాడుతున్న గౌతమ్


సమీక్ష నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

### అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలి

రంపచోడవరం, జూన్ 25: ఏజెన్సీలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ చాంబర్లో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ చేపట్టిన పనులు నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఇటీవల ఉపాధి హామీ పథకంలో మంజూరైన 75 పనులు, గుడిసె పర్యాటక కేంద్రంలో నిర్మిస్తున్న భవనాలు, జీసీసీ స్టోర్స్ భవనాల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈఈ జి.డేవిడ్‌రాజ్, డీఈలు గౌతమి, చైతన్య, నాగరాజు, ఏఈలు సత్యనారాయణ, భాను, ఉమామహేశ్వరరావు, వీరభద్రరావు, ఎస్‌వో టి.మార్తమ్మ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



అనపర్తి, జూన్ 25: అనపర్తి మండలం కుతుకులూరులోని కూటేశ్వర కాలనీలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రామారావు, బంధువుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బంగార్రాజు(32) కూటేశ్వర కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్నాడు. మంగళవారం పని జరుగుతున్న ప్రదేశంలో ఇసుక జల్లించుకునేందుకు ఏర్పాటు చేసిన యంత్రం వైరు జాయింటు వద్ద వేసిన ప్లాస్టర్ ఊడి పోయి ఉండడం గమనించని రాజు వైరుపై కాలు వేయడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు బంధువులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే రాజు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న బంధువులు రాజు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరయ్యారు. రాజు సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# 'బోటు బిల్డింగ్ యార్డ్ ధారాదత్తం తగదు'

కాకినాడ సిటీ, జూన్ 25 : కాకినాడలోని బోటు బిల్డింగ్ యార్డ్ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం తగదని ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు బలసాడి రంగారావు అన్నారు. మంగళవారం ఆయన కాకినాడలోని జగన్నాథపురంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ వ్యక్తికిచ్చిన బోటు బిల్డింగ్ యార్డ్ నిర్వహణను తక్షణం రద్దు చేసి మత్స్యశాఖకు అప్పగించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రూ.6 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఏటిమొగలో గల బోటు బిల్డింగ్ యార్డ్‌ను ఆధునికీకరించారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో బోటు బిల్డింగ్ యార్డ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసినట్లు చెప్పారు. దీంతో మూడు సంవత్సరాల క్రితం ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తికి బోటు బిల్డింగ్ యార్డ్ నిర్వహణను అప్పగించారన్నారు. దీంతో మత్స్యకారులు తమ బోట్లు మరమ్మతులు చేయించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బోట్ల మరమ్మతులు చేసుకోవడానికి కెనాల్ వెంబడి గట్టుపై నిలుపుకోవాల్సి వస్తుందన్నారు. తక్షణమే బోటు బిల్డింగ్ యార్డ్‌ను మత్స్యశాఖకు అప్పగించాలని రంగారావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, ధనుంజయ, బుజ్జి, దేవానందం, వాసు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మత్స్యకార సంఘం నాయకులు

## బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



గోకవరం, జూన్ 25: బైక్ అదుపు తప్పి గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన చంద్రు రమణ(29) మంగళవారం మృతి చెందాడు. రమణ తన వ్యక్తిగత పనులు ముగించుకొని గోకవరం నుంచి స్వగ్రామమైన కామరాజుపేటకు బైక్‌పై వెళ్తుండగా గోకవరం గ్రామ శివారున అదుపు తప్పి కింద పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు.



## ప్రత్తిపాడు ఆస్పత్రిలో 15 డయేరియా కేసులు


బాధితులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో

ప్రత్తిపాడు, జూన్25: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 15 డయేరియా కేసులు నమోదయ్యాయి. ప్రత్తిపాడు మండలానికి చెందిన 5 గురు కత్తిపూడి, బెండపూడిలకు చెందిన 10 మంది డయేరియాతో ఆసుపత్రిలో చేరారు. ఇప్పటికే గత రెండు రోజులుగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన డయేరియా బాధితులు మరో 15 మంది ఈ ఆసుపత్రిలో చికిత్స పొంది మంగళవారం డిశ్చార్జి అయ్యారు. దీంతో డయేరియా కేసులు ఎక్కువగా నమోదవడంతో డీఎంహెచ్‌వో నరసింహనాయక్ ఆస్పత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్య చర్యలు, క్లోరినేషన్, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నర్సింహనాయక్ హెచ్చరించారు. మండలంలోని రాచపల్లి, పెద్దిపాలెం,శాంతి ఆశ్రమం పీహెచ్‌సీ వైద్యాధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు.

## పాతవెలుగుబందలో చోరీ

రాజానగరం, జూన్ 25: మండలంలో పాతవెలుగుబంద గ్రామం జగనన్న కాలనీలో సోమవారం రాత్రి ఓ ఇంట్లో దొంగలు ప్రవేశించి బంగారు ఆభరణాలు, వెండి సామగ్రితో పాటు నగదును దోచుకున్నారు. కాలనీకి చెందిన బర్ల భవాని ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఇంట్లో భద్రపర్చిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతో పాటు రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్టు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

## గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగంపై అధికారుల నిఘా

### ఐదు గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

సామర్లకోట, జూన్ 25: సామర్లకోట, పెద్దాపురం మండలాల పౌర సరఫరాల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎంఎస్‌వోలు కీర్తి, విజయకుమారితో పాటు వీఆర్వోలు తులసీరాంజీ, నూతలపాటి లోవరాజు తనిఖీల్లో పాల్గొన్నారు. పలు హోటళ్లలో తనిఖీలు జరిగాయి. ఐదు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని సమీప గ్యాస్ ఏజెన్సీకి ఎంఎస్‌వో కీర్తి అప్పగించారు. ప్రభుత్వ రాయితీతో కూడిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్యావసరాలకు అక్రమంగా వినియోగించడం పౌరసరఫరాల చట్టం కింద నేరం కావడంతో 6ఏ చట్టం కింద కేసులు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఎంఎస్‌వోలు కీర్తి, విజయకుమారి చెప్పారు.

ఏజెన్సీ సమాచారం

## పోడు భూములు కాజేసేందుకు యత్నం

ఓ మహిళా ప్రజాప్రతినిధి కనుసన్నల్లో వ్యవహారం



పోడు భూమిని దున్నిన దృశ్యం

ఎటపాక, జూన్ 25: ఎటపాక మండలంలోని వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి పోడు భూములు కాజేసేందుకు యత్నిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పోడు భూమి సాగు చేసుకుంటున్న ఓ గిరిజనుడికి చెందిన భూమిని సోమవారం అర్ధరాత్రి దౌర్జన్యంగా దున్నేశారు. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన గిరిజనుడు గత 40 ఏళ్ల నుంచి సుమారు 4 ఎకరాల్లో పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆ పోడుభూమిపై కన్నేసిన ప్రజాప్రతినిధి ఎలాగైనా కబ్జాతో స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి గిరిజనుడు సాగు చేసుకుంటున్న 4 ఎకరాలతో పాటు మరో 15 ఎకరాల పోడుని కూడా ఆ ప్రజాప్రతినిధి అనుచరులు దున్నేసినట్లు తెలుస్తోంది. దాంతో ఆ గిరిజనుడు ఉదయాన్ని చూసి, విస్తుపోయాడు. బాధిత గిరిజన రైతు స్థానిక సచివాలయంలో మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఈ ప్రజాప్రతినిధి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక అరాచకాలకు పాల్పడినట్లు విమర్శలు ఉన్నాయి. ఓ గ్రామంలో గిరిజన మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను అడ్డుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ భూమిలో ఇళ్లు నిర్మించుకోవడానికి అనుమతి లేదని, నిర్మిస్తే అడ్డుకుంటానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది.

### రాత్రికి రాత్రే 4 ఎకరాల పొలం దున్నేశారు

జె.సూర్యం, బాధిత గిరిజన రైతు

40 ఏళ్లకు పైగా పోడు భూమి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాను. నాకున్న కొద్దిపాటి పొలంతో పాటు పోడు భూమిని కలిపి సాగు చేసుకుంటున్నాను. ప్రజాప్రతినిధి కబ్జాలో బాగంగా 4 ఎకరాల పొలంను దున్నేశారు. నా పొలం పక్కనే 20 ఎకరాల పోడు భూమి ఉంది. దాన్ని దున్నేస్తూ నా 4 ఎకరాల పొలంను ఆక్రమణకు యత్నిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని, నాకు న్యాయం చేయాలి.

## నాగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

రంపచోడవరం, జూన్ 25: స్థానిక ఇల్లా లచ్చిరెడ్డి వారి వీధిలో కొలువైన మాతృశ్రీ నాగమ్మతల్లి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు రంపచోడవరం ధర్మప్రచార భక్తమండలి కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి వలల సత్యవతి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కారుకోడి పూజ, వై.సీతామహాలక్ష్మి, వి.లక్ష్మి, వి.గౌరి, కె.వెంకటలక్ష్మి, ఎం.ఆదిలక్ష్మి, ఐ.శ్రీనివాస్‌రెడ్డి, ఐ.లక్ష్మి, వి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు అండగా ఉంటాం

రంపచోడవరం, జూన్ 25: ఏజెన్సీ ప్రాంత ఉద్యోగులతో పాటు రాష్ట్ర స్థాయి ఎస్సీ ఉద్యోగులకు మాల మహాసభ, మాల జేఏసీ, దళిత సేవా సంఘం అండగా ఉంటుందని దళిత సేవా సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి మాదే రామచంద్రరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దళిత ప్రజలు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు.

## డీఐజీని కలిసిన ఎమ్మెల్యే శిరీషాదేవి



రంపచోడవరం, జూన్ 25: ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో శాంతిభద్రతల అంశాన్ని డీఐజీకి వివరించారు. ముఖ్యంగా గంజాయి స్మగ్లింగ్, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా క్షేత్ర స్థాయిలో పోలీసు అధికారులు పర్యవేక్షించేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

అడ్డతీగల, జూన్ 25: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేదుళ్ళ బాలురెడ్డి అధికారులకు సూచించారు. ఆదివాసీ ప్రాంతం నుంచి ఎంపికైన ఎంపీ, ఎమ్మెల్యేలు ముందుగా ఆదివాసీల ఆరోగ్య, వైద్య విధానంపై దృష్టి సారించాలన్నారు. విష జ్వరాలు, డయేరియా, డెంగ్యూ, మలేరియా వ్యాప్తి చెందకుండా చూడాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని కోరారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థినులు వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

## విద్యా వ్యవస్థ పటిష్టతే లక్ష్యం

కూనవరం, జూన్ 25: మండలంలో విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ బూత్ కమిటీ ఇన్‌చార్జిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 71 టీచర్లు ఉండాల్సి ఉండగా 41 మంది టీచర్లు ఉన్నారని 12 స్కూళ్లకు ఒక్కరు కూడా టీచర్లు లేరని వారు తెలిపారు. ఉపాధ్యాయులను తక్షణమే ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## 'మొదటి ప్రాధాన్యం వారికే ఇవ్వాలి'

కూనవరం, జూన్ 25: రాష్ట్రంలో అన్ని ఐటీడీఏల పరిధిలో ఆశ్రమ గురుకుల పాఠశాలలో ఏఎన్‌ఎంలగా గతంలో పనిచేసిన వారికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ అన్నారు. గురుకుల పాఠశాలలో ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎంలను నియమించాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మొదటి సంతకం చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ చింతూరు డివిజన్ ఉపాధ్యక్షుడు వెటకాని నల్లయ్య, రాములమ్మ, శాంతకుమారి, రాజేశ్వరి, శ్రీదేవి, శుభశ్రీ పాల్గొన్నారు.

## రోడ్లపై గోవులతో ఇబ్బందులు

మోతుగూడెం, జూన్ 25: చింతూరు మండలం మోతుగూడెం ఆంధ్రాబ్యాంక్ సెంటర్లో మంగళవారం గోవులన్నీ రహదారిపై అడ్డంగా నిలబడి ఉండటంతో ద్విచక్ర వాహనదారుడు గోవులను తప్పించబోయి పక్కన ఉన్న కాలువలో పడిపోయాడు. అటుగా వెళుతున్న బాటసారి ద్విచక్ర వాహనదారుడిని రక్షించి పైకి తీశారు. స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గోవులను రోడ్డుపై నుంచి పక్కకు తరలించాలని లేదా గో సంరక్షణకు అప్పగిస్తే బాగుంటుందని పంచాయతీ వారు చొరవ తీసుకుని తగు చర్యలు చేపట్టాలని బాటసారులు, వాహనదారులు కోరుతున్నారు.

## బస్ పాస్‌ల క్యాంపు ఏర్పాటు

కూనవరం, జూన్ 25: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌లో బస్‌పాస్‌లు క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పాస్‌లు 43, విద్యార్థులకు 83, స్టూడెంట్ మనీ పాస్‌లకు 40 దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 126 దరఖాస్తులను గోకవరం డిపోకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ కోఆర్డినేటర్ ఎంఎంఎస్ వీరబాబు, ఏఎస్‌బీఎస్ రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికి నైపుణ్య శిక్షణ అవశ్యం

ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ గోకా చంద్రశేఖరరావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 25: మహిళలు స్వయం వృద్ధి సాధించాలంటే నైపుణ్యం గల వృత్తులు ఎంతగానో ఉపయోగపడతాయని ఓఎన్‌జీసీ జీఎం గోకా చంద్రశేఖరరావు అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు స్వర్ణాంధ్రలో ఉచితంగా కుట్టు శిక్షణ పొందిన 72వ బ్యాచ్‌కు చెందిన మహిళలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం అందించారు.జూన్ 30 నుంచి నూతన బ్యాచ్ శిక్షణ ప్రారంభమవుతుందని రాంబాబు తెలిపారు.

# వానొస్తే.. ముప్పే!

- ముంపు బారిన రేగులచెరువు కాలనీ
- ఇళ్ల స్థలాలు కేటాయించి మేలు చేయండి
- అప్పటివరకూ ముంపు నివారణ చర్యలు చేపట్టాలి
- దివాన్‌చెరువు రేగు చెరువు కాలనీ వాసుల మొర



ఆదివారం కురిసిన వర్షానికి నీట మునిగిన దివాన్‌చెరువులోని రేగుల చెరువుకాలనీ

దివాన్‌చెరువు, జూన్ 25: దివాన్‌చెరువులోని రేగులచెరువు కాలనీ ముంపు బారిన పడింది. ఆదివారం తెల్లవారుఝాము నుంచీ కురిసిన వర్షానికి రేగులచెరువు కాలనీలోని వీధుల్లో నీరు నిలిచిపోవడంతో బాటు కొన్ని ఇళ్లలోకి నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే, నాలుగైదు గంటల తర్వాత ముంపు నీరు తొలగడంతో ప్రజలు ఊరట చెందారు. దాదాపు గత 25 సంవత్సరాలుగా తాము ఇక్కడ నివసిస్తున్నామని, పెద్ద వర్షం కురిసిన ప్రతిసారీ తమ కాలనీలో ఇదే పరిస్థితి నెలకొంటోందని కాలనీ వాసులు పలువురు వాపోయారు. వర్షం పెద్దగా కురిసినపుడు గుమ్మలగొయ్యి నుంచి వచ్చే నీటితో కాలనీ ఇలా ముంపు బారిన పడుతోందని తెలిపారు. వీధుల్లో మోకాలు లోతు నీరు నిలవడంతో బాటు కొన్ని ఇళ్లలో రెండు అడుగుల మేర నీరు చేరుతోందని కొందరు చెప్పారు. దీంతో ఏలిగపాములు వంటివి ఇళ్లలో చేరుతున్నాయన్నారు. నీరు తగ్గిన తర్వాత ఇళ్లలోని బురదను శుభ్రం చేసుకోవడం చాలా కష్టంగా ఉంటోందని వాపోయారు. కాలనీ ముంపు బారిన పడిన ప్రతిసారీ తమ అవస్థలు వర్ణనాతీతమని చిన్నపిల్లలతో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. రాత్రి వేళల్లో కాలనీలో ఈ పరిస్థితి ఏర్పడితే ఏంచేయాలో పాలుపోవడంలేదని కొంతమంది మహిళలు చెప్పారు. రేగులచెరువు కాలనీలో దాదాపు వంద ఇళ్లు ఉండగా, వాటిలో సుమారు రెండు వందల కుటుంబాల వారు నివసిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. ఏళ్ల తరబడి తమ కాలనీలో ఈ సమస్యలున్నా పరిష్కరించే వారు కరువయ్యారని వాపోయారు. ఎన్నికల సమయంలోనే తాము గుర్తుకు వస్తామని అపుడు వచ్చి ఏవో కాగితాలు ఇచ్చి ఓట్లు వేయమంటున్నారని, ఆ తర్వాత తమను పట్టించుకోవడంలేదని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నాయకులు స్పందించి తమ ఇబ్బందులను పరిష్కరించాలని వారు కోరారు. తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతవరకూ తమ కాలనీ ముంపుబారిన పడకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని వారు కోరుతున్నారు.

# వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- కడియం ఎంపీపీ సత్యప్రసాద్



కడియం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యప్రసాద్

కడియం, జూన్ 25: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చాలా అవసరమని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, మంచి నీటి ట్యాంకుల్లో ఎప్పటికపుడు క్లోరినేషన్ చేయాలని, క్వాలిటీ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. గ్రామాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేయించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎస్.జెస్సీ సుప్రియ, డాక్టర్ ఎం.మణి జ్యోత్స్న, ఈవోపీఆర్‌డీ విక్టర్‌బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శివకుమార్, ఆరోగ్య విస్తరణాధికారి ఎంవీవీ రామకృష్ణ, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు

కోరుకొండ, జూన్ 25: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ నెల 30 వరకు ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో హేమసుందర్ తెలిపారు. అలాగే జూలై 1నుంచి 31 వరకు డయేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు మంగళవారం కోరుకొండ మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, నీటి కాలుష్యం జరగకుండా గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు, డయేరియా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడం, మంచినీటి ట్యాంకుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయడం, డ్రైన్‌లో చెత్త తొలగించడం, పారిశుధ్యం మెరుగు పరచడం వంటి కార్యక్రమాలు ఈ నెల 30వరకు అమలు చేయాలన్నారు. సమావేశంలో కోరుకొండ, కోటికేశవరం, దోసకాయలపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మొక్కుబడిగా పారిశుధ్య వారోత్సవాలు

- పనులను సిబ్బందికి అప్పగిస్తున్న అధికారులు
- కార్యక్రమాలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్న వైనం



చక్రద్వారబంధంలో చెత్తను తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది

రాజానగరం, జూన్ 25: ప్రజారోగ్యంపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పారిశుధ్య వారోత్సవాలు రాజానగరం మండలంలో మొక్కుబడిగా సాగుతున్నాయి. ఈ నెల 24నుంచి జూలై 4వ తేదీ వరకు మండలంలో గ్రామ గ్రామాన ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే సంబంధిత అధికారులు మాత్రం సచివాలయ ఉద్యోగులు, సిబ్బందికి అప్పగించి తూతూ మంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున వైద్యాధికారులతో పాటుగా వివిధ శాఖల అధికారులు పారిశుధ్యంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. గ్రామాల్లో మంచి నీటి ట్యాంకులను శుభ్రం, క్లోరినేషన్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు పరిసరాల పరిశుభ్రత, మంచినీటి పరీక్షలతో పాటు ఇంటింటా ఫీవర్ సర్వే చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే కేవలం ఫొటోలకే పరిమితం అవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని చక్రద్వారబంధం, నరేంద్రపురం, సీతారాంపురం, రాజానగరం మంగళవారం నిర్వహించిన పారిశుధ్య వారోత్సవాలు మొక్కుబడిగా జరిపి చేతులు దులుపుకున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

## కాలువల్లో పూడిక తీత పనులు

కోరుకొండ, జూన్ 25: నియోజకవర్గంలో పలు కాలువల్లో పూడిక తీత పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. గాదరాడ పుష్కర కాలువ, రామచంద్రపురం వద్ద తొర్రిగడ్డ వద్ద పంపింగ్ స్కీమ్ కాలువ, శింగవరం కొండ నుంచి మొదలై చినకొండేపూడి వెళ్లే కాలువ, శ్రీరంగపట్నం బురదకాలువ పూడికతీత పనులు ఒకే రోజు అధికారులు ప్రారంభించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మద్దాల ఏసుపాదం, కారిచర్ల విజయశంకర్, చల్లా సుబ్రహ్మణ్యం, సింగవరం లింగరాజు, మట్టా వెంకటేశ్వరరావు, నాగారపు సత్తిబాబు, గెడ్డం కృష్ణారావు, బుద్దా బ్రహ్మం, దాడి సీతయ్య పాల్గొన్నారు.

## కోటికేశవరంలో నేను బడికి పోతా ర్యాలీ

కోరుకొండ, జూన్ 25: మండలం కోటికేశవరం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో టి.కుశలవదొర పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ జరిపారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ బడిలో చేర్పిద్దామంటూ గ్రామంలో ర్యాలీ చేశారు. గ్రామంలో ముఖ్య కూడలి వద్ద విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి గ్రామస్తులకు నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



రంగంపేట హైస్కూల్లో విద్యార్థినులతో సమావేశమైన సీడీపీవో జెస్సీఫ్లోరెన్స్

రంగంపేట, జూన్ 25: బాలికల అక్రమ రవాణా, హక్కులు, బాల్యవివాహాలు, పోక్సో, పీసీపీఎన్‌డీటీ చట్టాలపై అవగాహన పెంచుకొని, వాటి అమలు ద్వారా రక్షణ పొందడానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీఫ్లోరెన్స్ సూచించారు. మంగళవారం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అధ్యక్షతన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చదువుతోపాటు సంస్కారం, సంస్కృతిని అలవర్చుకోవాలని, కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవడానికి బాలికలు చైతన్యవంతులు కావాలని సూచించారు. ఉన్నత విద్య, ఉత్తమ కుటుంబ బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని హెచ్‌ఎం సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగ సామాజిక కార్యకర్త కె.శిరీష, సూపర్‌వైజర్లు వాణి, బేగం, పలువురు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కన్నమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే గోరంట్ల



కన్నమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 26: రూరల్ నియోజకవర్గం పరిధిలోని రాజమహేంద్రవరం 18వ డివిజన్‌లో ఉన్న కన్నమ్మతల్లి ఆలయ 106వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దర్శించుకుని అమ్మ వారికి పూజలు చేశారు. ఆయనకు ఆలయ పెద్దలు సాదరంగా స్వాగతం పలికారు. పూజలు అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం 19వ డివిజన్‌లో కన్నమ్మ తల్లి ఆలయం 126వ వార్షికోత్సవంలో గోరంట్ల పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## 29 నుంచి 'సుప్రీం' లోక్ అదాలత్

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, జూన్ 25(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి జూలై 29 నుంచి ఆగస్టు 3వరకూ సుప్రీం కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుప్రీంలో నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌కి ఢిల్లీ వెళ్లనవసరం లేదన్నారు. ఆయా ప్రాంతాల నుంచే కేసులను పంపించవచ్చని చెప్పారు. ఆ మేరకు న్యాయ సేవాధికార సంస్థలు ఏర్పాట్లు చేశాయన్నారు. ఫిజికల్/వర్చువల్ విధానంలో ముందస్తుగా లోక్ అదాలత్ సమావేశాల్లో పాల్గొన డం ద్వారా కేసుల్లో రాజీ కుదుర్చుకోడానికి కక్షిదారులకు వీలు కల్పిస్తోందని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు కక్షిదారులు, న్యాయవాదులు టోల్‌ఫ్రీ నెం.15100కి ఫోన్ చేయవచ్చన్నారు. కోర్టు ప్రాంగణాల్లో ఉండే జిల్లా/మండల న్యాయ సేవాధికార సంస్థల్లో సంప్రదించవచ్చన్నారు. ఈ నెల 29న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కక్షిదారులు, న్యాయవాదులు అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని జడ్జి కె.ప్రకాశ్‌బాబు కోరారు.

## బస్సులో ప్రయాణికుడి మృతి

జంగారెడ్డిగూడెం, జూన్ 25: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఏటుకూరి అప్పారావు (55) అస్వస్థతతో బస్సులోనే మృతిచెందిన ఘటన మంగళవారం జరిగింది. ఆర్టీసీ డీఎం పి.గంగాధరరావు తెలిపిన వివరాల ప్రకారం కోరుకొండ గ్రామానికి చెందిన అప్పారావు బత్తాయి పండ్ల బుట్టలు కట్టే పనికి కామవరపుకోట వచ్చాడు. అప్పటికే అతడికి ఒంట్లో బాగోకపోవడంతో తోటి కార్మికులు స్వగ్రామం వెళ్ళిపోవాలని సూచించారు. అప్పారావు కోరుకొండ వెళ్లడానికి జంగారెడ్డిగూడెం వెళ్లే బస్సు ఎక్కాడు. కామవరపుకోట దాటగానే కండక్టర్ టిక్కెట్ కోసం అప్పారావు దగ్గరకు వెళ్లగా అతనిలో చలనం లేదని గ్రహించాడు. జంగారెడ్డిగూడెం సమీపిస్తుండగా 108 అంబులెన్సుకు కండక్టర్ సమాచారం ఇచ్చారు. బస్సు జంగారెడ్డిగూడెం చేరుకోగానే అంబులెన్స్ సిబ్బంది పరిశీలించి అప్పారావు చనిపోయినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు సాధారణ మరణమని నిర్ధారించారు.

## 28న పశుసంచార వాహన డ్రైవర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 25 : పశుసంచార వాహనాల్లో ఖాళీగా ఉన్న ఐదు పైలెట్ (డ్రైవర్) పోస్టులకు ఈనెల 28న ముఖాముఖి ఇంట ర్వూలు నిర్వహిస్తున్నట్టు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి టి.శ్రీనివాసరావు తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఇంటర్వ్యూలు 28న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రాజమహేంద్రవరం పశువైద్య శాఖ ఆవరణలో జిల్లాలో ప్రోగ్రామ్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.ఈ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, రెండు, మూడేళ్ల డ్రైవింగ్ అనుభవంతో పాటు హెవీ లైసెన్స్ కలిగి ఉండాలని, వయస్సు 35 ఏళ్ళలోపు వుండాలన్నారు. ఎస్సీఎస్టీబీసీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుందన్నారు. నెలకు జీతం రూ.12 వేలు. అర్హులు నేరుగా ఇంటర్వ్యూ జరుగు స్థలానికి రావాలన్నారు. ఒరిజినల్ లైసెన్సు, సర్టిఫికెట్స్ రెండు జిరాక్స్ సెట్‌లు, సెల్ఫ్ అటెస్టెడ్ పాస్‌పోర్టు సైజు ఫొటోలు మూడు జతపరిచి తీసుకురావాలన్నారు. సమాచారం కోసం వంశీ 88012 53588, రమేష్ 62606 24232 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## కాంగ్రెస్ నిరంకుశపాలనకు నిదర్శనం ఎమర్జెన్సీ

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు




జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 25: కాంగ్రెస్ నిరంకుశపాలనకు గతంలో ఇందిరాగాంధి విధించిన ఎమర్జెన్సీయే నిలువెత్తు నిదర్శనమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. ఎమర్జెన్సీ డే సందర్భంగా జేఎన్ రోడ్‌లోని జేకే గార్డెన్స్ తూర్పుగోదావరి జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ విధానాలపై గౌరవం లేకుండా ప్రవర్తించడం కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రపతితో బలవంతంగా సంతకం చేయించి నిరంకుశంగా ఆనాడు ఎమర్జెన్సీని విధించడం ఇందిరాగాంధీ చరిత్రలోనే మాయని మచ్చ అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ఎస్ నాయకుడు ఓలేటి సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ, కారుపాటి వివేకానంద, కురగంటి సతీష్, బెతిరెడ్డి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## కొద్దిపాటి మెలకువలతో నాణ్యమైన దిగుబడులు

ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు




రైతు సదస్సులో సూచనలిస్తున్న నరసింహారావు

అనపర్తి, జూన్ 25: శాస్త్రీయ వ్యవసాయ విధానాలను అవగాహన చేసుకుని కొద్దిపాటి మెళుకువలు పాటిస్తే స్థిరమైన, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మంగళవారం అనపర్తిలోని రైతు భరోసా కేంద్రంలో ఏరువాక ఆధ్వర్యంలో ఏడీఏ కృష్ణ అధ్యక్షతన జరిగిన రైతు సదస్సుకు ఆయన విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుతం సార్వాలో వరి నారుమడులు దశ కొనసాగుతోందని, కొన్ని చోట్ల నాట్లు ప్రారంభమయ్యాయన్నారు. నారు తీసే వారం ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటు నారు మడికి 160 గ్రాముల చొప్పున చల్లుకోవాలని, దీనివల్ల కాండం తొలిచే పురుగు నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. ప్రధాన మండిలో ఎరువులను సిఫారసు చేసి 36-24-24 కిలోల నత్రజని భాస్వరం పొటాష్ ఇచ్చే ఎరువులను వాడుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, హైమాజ్యోతి వరిలో కలుపు నివారణ విధానాలు, వరిలో రకాలు, మార్కెటింగ్, లాభదాయక పంటలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అభయాంజనేయుడికి 8 వేల బూర్లు



అనపర్తి, జూన్ 25: అనపర్తి ఎమ్మెల్యేగా కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధిస్తే కుతుకులూరు అభయాంజనేయ స్వామికి ఎనిమిది వేల బూర్లు నివేదిస్తామని గ్రామానికి చెందిన కూటమి నాయకులు పులగం శాంత, కొవ్వూరి రామారెడ్డి(మేస్త్రీ), పులగం తిరుమల రెడ్డిలు మొక్కుకున్నారు. దీంతో మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బూర్లను సమర్పించారు. కార్యక్రమంలో నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే నల్లమిల్లి కలిసిన టీడీపీ నాయకులు



బిక్కవోలు, జూన్ 25: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని సోమవారం రాత్రి ఊలపల్లికి చెందిన పీహెచ్‌సీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కలిసారు. ఈ సందర్భంగా ఆయనతో కేకు కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో సురేష్, అశోక్, మహేష్, ఎన్‌డీఏ యూత్ పాల్గొన్నారు.

## ఆళ్ల గోవింద్‌ను కలిసిన వీఆర్‌ఏలు

రంగంపేట, జూన్ 25: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్‌ను మండల వీఆర్‌ఏ కార్యవర్గ సభ్యులు వడిశలేరులో ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు ఇందుగుమిల్లి సుబ్బారావు, సభ్యులు గోవింద్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.





పవన్ క్యాంపు ఆఫీస్ ఎదుట రాజమండ్రి మహిళ ఆత్మహత్యాయత్నం

# వైసీపీ నేతలు.. సొసైటీల్లో మేతలు!




(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో ఎటు చూసినా అవినీతి ఆనవాళ్లే.. ఐదేళ్లు భయపెట్టి.. సంక్షేమం ముసుగులో పాలన సాగించడంతో ఏ ఒక్కటీ బయటకు రాలేదు.. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. వైసీపీ పాలనలో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ సహకార పరపతి సంఘాలు అవినీతి కేంద్రాలుగా మారాయి. రూ.కోట్ల కుంభకోణాలు జరిగాయి.వెలుగులోకి వస్తున్న అవినీతి బాగోతాలు చూస్తుంటే నోరెళ్లబెట్టక తప్పనిపరిస్థితి. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో రూ.కోట్ల అవినీతి బయటపడింది.జిల్లాలో 107 సొసైటీలు ఉన్నాయి. రాజమహేంద్రవరం డివిజన్‌లో 48, కొవ్వూరు డివిజన్‌లో 59 ఉన్నాయి. ఎక్కువ సొసైటీలు అక్రమాల పుట్టలుగా తయారయ్యాయి. రైతులు, ప్రభుత్వాలను మోసం చేస్తూ సొసైటీ పాలకవర్గాలు, సొసైటీ సీఈవో (సెక్రటరీ)తో కుమ్మక్కయ్యి రూ.కోట్లు దోచేస్తున్నారు. అసలు లాభం అనేదే చూపకుండా నష్టాలు చూపిస్తున్నారు. సహకార వ్యవస్థ మొత్తం ఇలానే ఉంది.

## రైతులు చెల్లించారు.. నేతలు బొక్కేశారు..

గ్రామాల పరిధిలో ఉన్న వ్యవసాయ భూములకు సొసైటీల ద్వారా రుణాలు ఇస్తారు.అయితే ఈ సొసైటీలో ఇతర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు రుణాలు తీసుకున్నారు. వాస్తవానికి సొసైటీ పరిధిలో భూములు ఉండి, వాటి యజమానులు ఏ ప్రాంతంలో ఉన్నా రుణాలు తీసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.కానీ సరైన డాక్యుమెంట్లు చూపకుండా రుణాలు ఇవ్వడం, రుణాలు ఇచ్చినందుకు లంచాలు తీసుకోవడం ఎక్కడైనా జరుగుతుంటుంది. కానీ ఈ సొసైటీ ద్వారా రుణాలు పొందిన వ్యక్తుల నుంచి రికవరీ చేసి దానికి సంబంధించిన డాక్యుమెంట్లు రైతులకు ఇచ్చేశారు.కానీ రైతులు రుణాలు చెల్లించినట్టు సొసైటీలో ఆధారాలు లేవు. రైతుల పేరిట అప్పులు చూపిస్తున్నారు. రైతులకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇచ్చేయడంతో ఇబ్బంది లేదు. రుణాలకు చెల్లించిన డబ్బంతా సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు, సీఈవో, సిబ్బంది తినేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.ప్రస్తుతం రికార్డులు, క్యాష్ బుక్‌లు లెడ్జర్లు,వోచర్లు వంటివి ఏమీ లేవు. దీంతో అధికారులు రైతులవారీ తిరిగి విచారణ చేస్తుండడంతో బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక శ్రీరంగపట్నం సొసైటీలో మొదటి త్రిసభ్య కమిటీ.. వైసీపీ నాయకుడు అత్తిలి రాంప్రసాద్ చైర్మన్‌గా, నందూరి నాగేశ్వరరావు, సింగంపల్లి శ్రీనివాస్ సభ్యులుగా ఉండేవారు. అప్పుడు సెక్రటరీ(సీఈవో)గా ఎం.శ్రీనివాసరావు ఉండేవారు. ఆ సమయంలోనే ఎక్కువ అవినీతి జరిగినట్టు తెలుస్తోంది. తర్వాత బుద్దా శ్రీనివాస్ చైర్మన్‌గా తనకాల ప్రసాద్, డేగల నాగేశ్వరరావు సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం విచారణ జరిపిస్తోంది. ఇక్కడ అవినీతి మరింత పెరిగే అవకాశం ఉంది.

## సొసైటీల్లో త్రిసభ్య కమిటీల అక్రమాలు

- జిల్లాలో అవినీతికి సహకారం
- త్రీమెన్ కమిటీల ఇష్టారాజ్యం
- వైసీపీ పాలనలో అంతా బొక్కుడే
- శ్రీరంగపట్నంలో బయటపడిన బాగోతం
- ప్రస్తుతానికి రూ.1.80 కోట్లు గల్లంతు
- కొనసాగుతున్న విచారణ
- కనిపించని లాకర్ తాళాలు
- ఇప్పటికే సెక్రటరీపై సస్పెన్షన్ వేటు
- జిల్లావ్యాప్తంగా 107 సొసైటీలు
- మిగిలిన సొసైటీల మాటేంటో?

## నీరుగారుతున్న ఆశయం..

రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చి, ప్రోత్సహించడానికి,లాభాల్లో డివిడెండ్లను కూడా రైతులకు పంచడానికి సొసైటీలు పనిచేయాలి. ఎరువులు,విత్తనాలు అమ్మడం, ధాన్యం కొనుగోలు చేయడం వంటివి కూడా సొసైటీలు చేస్తుంటాయి. రైతులకు గ్రామాల్లో అందు బాటులో ఉండడం, రైతులు పంటలు పండించడానికి అవసరమైన పెట్టుబడి కోసం రైతుల భూములను తాకట్టు పెట్టుకుని రుణాలు ఇస్తుండాలి. గతంలో కొన్ని సొసైటీలు బాగా పనిచేసేవి. వచ్చిన లాభాల్లో రైతులకు డివిడెండ్లను ఇచ్చేవి. అయితే వైసీపీ పాలనలో అసలు సొసైటీ ఎన్నికలే జరగలేదు..ఐదేళ్లు త్రీమెన్ కమిటీలతోనే నడిపించారు. ఎంతో ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన సొసైటీలు వైసీపీ పాలనలో నామినేటెడ్ పదవులకు కేంద్రాలుగా మారాయి. కనీస అవగాహన లేని వారే త్రీమెన్ కమిటీల్లో ఉండడంతో సొసైటీల నుంచి రైతులకు అందిన సాయం సున్నా.

## జిల్లాలో 107 సొసైటీల్లోనూ ఇంతే?

జిల్లాలోని 107 సొసైటీలు అక్రమాలకు కేంద్రాలుగా మారిపోయాయి. సొసైటీలు అంటేనే దోచుకోవడానికి తప్ప, రైతులకు ఉపయోగపడేవిగా ఇవి పనిచేయడంలేదు.పైగా ఇందులో రాజకీయనేతలు కూడా కుమ్మక్కయి ఉండడం వల్ల విచారణ జరగడమే కానీ రికవరీలు కనిపించడంలేదు. మహా చేస్తే పాలకవర్గాన్ని తిరిగి పోటీ చేయకుండా చేస్తున్నారు.అధికారులను సస్పెండ్ చేస్తున్నారు.వాళ్లు తిరిగి ఏదో విధంగా మళ్లీ అధికారంలోకి వచ్చి, మళ్లీ అవినీతి ఆరంభిస్తున్నారు. వీటికి క్రిమినల్ చర్యలు ఉండడం, అవినీతి సొమ్మును రికవరీ చేయడం వంటివి పటిష్టంగా,కఠినంగా ఉంటే సొసైటీలు ఉప యోగకరంగా మారవచ్చు.చర్యలు లేకపోవడం వల్ల రైతుల సొమ్ము,ప్రభుత్వానికి అందాల్సిన సొమ్ము ఆయా ప్రాంతాల నేతలే బొక్కేసి సొసైటీలు నిర్వీర్యం చేస్తున్నారు.

## శ్రీరంగపట్నంలో రూ.2 కోట్లు పక్కదారి

కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సొసైటీ టర్నోవర్ సుమారు రూ.11 కోట్లకు పైగా ఉంటుంది. 1932 ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ సొసైటీలో పరిసర గ్రామాలకు చెందిన 1994 ప్రాంతంలో సొసైటీలో విలీన మయ్యాయి.సొసైటీ పరిధిలో శ్రీరంగపట్నం, బొల్లెద్దు పాలెం, కోటి, కోటి-కోటికేశవరం, రాఘవాపురం, గరగ పాలెం గ్రామాలు ఉన్నాయి.వాటి పరిధిలో 2,424 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. కనీసం నిబంధన ప్రకారం రూ.300 షేర్‌ధనం ఉన్న సభ్యులు సుమారు 1400 మంది వరకూ ఉంటారు. సొసైటీలకు చాలా కాలం నుంచి ఎన్నికలు జరగడంలేదు. గత 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ నేతలతో త్రిసభ్య కమిటీలను నియమించింది.ఈ ఐదేళ్లలో రెండు త్రిసభ్య కమిటీలు పనిచేశాయి. ఇటీవల టీడీపీ అధికారంలోకి రావడంతోనే వాటిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. 2019 నుంచి 2023 వరకూ ఇక్కడ రూ.2 కోట్లకు పైగా అవినీతి జరిగినట్టు తెలుస్తోంది.జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు ప్రస్తుతం 51ఎ ఎంక్వయిరీ నడుస్తోంది.ఇప్పటికే .రూ.కోటి 80 లక్షల అవినీతి బయటపడింది.దీనికి బాధ్యుడిని చేస్తూ ఇప్పటికే సీఈవో శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు.విచారణ చేసే కొద్దీ అవినీతి బయటపడు తోంది. రైతులకు రుణాలివ్వడంలోనూ అవకతకలు జరిగాయి.

### బంగారం లాకర్ కీ ఎక్కడ?

ఐదేళ్లు వైసీపీ నాయకుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. శ్రీరంగపట్నం పాత సొసైటీ భవన స్థలం కనీస అనుమతుల్లేకుండా సచివాలయానికి ఇచ్చేశారు. ఆ స్థలంలో సచివాలయం నిర్మించేశారు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ నిమిత్తం అనధికారికంగా సొసైటీ నుంచి రూ.75 లక్షలు బిల్లులు చేసినట్టు సమాచారం. సొసైటీ నుంచి బిల్లులు చేయడం ఉండదు. అయితే ఈ సొసైటీ నుంచి బిల్లులు చేయడం గమనార్హం. బంగారం లాకర్ కీ కూడా కనిపించడంలేదు. ఆ తాళం సొసైటీ సెక్రటరీ వద్ద ఉన్నట్టు సమాచారం.

# స్థలం సమస్య తీరుస్తారా.. చచ్చిపోమంటారా?

- పవన్ క్యాంపు ఆఫీస్ వద్ద ఆత్మహత్యాయత్నం
- మహిళను అడ్డుకుని రక్షించిన పోలీసులు
- దంపతులు పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- వైసీపీ కార్పొరేటర్ వేధింపులతోనేనని వెల్లడి
- అధికారంతో భూమిని ఆక్రమించినట్టు ఆరోపణ
- రాజమహేంద్రవరానికి చెందిన వారిగా వెల్లడి

విజయవాడ, రాజమహేంద్రవరం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల భూదాహం, వేధింపులతో విసిగిపోయిన ఓ మహిళ విజయవాడలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయం వద్ద ఆత్మహత్యకు యత్నించారు.మంగళవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.ఈ ఘటనపై రెండు భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. రాజమహేంద్రవరంలో 1,200 గజాల స్థలం ఉందని మేడిశెట్టి రాంబాబు, దుర్గాదేవి దంపతులు చెబుతున్నారు. దీన్ని వైసీపీ మహిళా కార్పొరేటర్ ఆక్రమించుకున్నారని దుర్గాదేవి ఆరోపిస్తున్నారు. సీఎం చంద్రబాబుకు తమ సమస్యను విన్నవించుకోవడానికి విజయవాడ వచ్చినట్టు చెప్పారు. అయితే పోలీసులు అడ్డుకోవడంతో ఆయన్ను కలవలేకపోయామన్నారు. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం వద్దకు వస్తే అక్కడా పోలీసులు అడ్డుకున్నారు. అప్పాయింట్‌మెంటు ఉండాలని సూచించారు. దీంతో దుర్గాదేవి క్యాంపు కార్యాలయానికి ఎదురుగా ఉన్న పోలీసు క్వార్టర్స్ భవనం ఎక్కి దూకేసేందుకు ప్రయత్నించారు.గమనించిన పోలీసులు వెంటనే ఆమెను భవనంపై నుంచి కిందికి తీసుకొచ్చారు. అనంతరం దంపతులను సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహిళా కార్పొరేటర్ ఓ దళారీ ద్వారా తమ స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రాజమహేంద్రవరం పోలీసులపై నమ్మకం లేదని, సీఎం చంద్రబాబును కలిసి గోడు వెళ్లబోసుకోవాలని వచ్చినట్టు వివరించారు.

### స్థలం రాజమండ్రిలో కాదు..రాజాంలో : పోలీసులు

అయితే రాజమహేంద్రవరం పోలీసులు మాత్రం మరో విధంగా చెబుతున్నారు.రాజమహేంద్రవరానికి చెందిన మేడిశెట్టి రాంబాబు దంపతులు ప్రస్తుతం కాకినాడలో నివాసం ఉంటున్నారని తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్యాపురంలో సుమారు 30 గజాల్లో పాడుబడిన పెంకుటిల్లు ఉందని చెప్పారు. ఆ ఇంటి విషయమై సోదరుల మధ్య వివాదం ఉండగా కోర్టు ద్వారా రాంబాబుకే దక్కిందన్నారు. అయితే దంపతుల చెబుతున్న స్థలం 1200 గజాలు రాజమహేంద్రవరంలో కాదని శ్రీకాకుళం జిల్లా రాజాంలో ఉన్నట్టు చెబుతున్నారు. రాంబాబు భార్య దుర్గాదేవికి ఆమె తల్లిదండ్రులు ఇచ్చినట్టు ఆమె చెప్పిందని పేర్కొంటున్నారు. రాజాంలోని స్థలం అక్కడ వైసీపీ నాయకుడు ఆక్రమించడంతో తేల్చాలని రాంబాబు, ఆయన భార్య గతంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చారన్నారు.ఈ ఘటనపై గతంలో హైకోర్టు వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కోర్టు ఆదేశాలతో 2023 మార్చిలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆ కేసు పెండింగ్‌లో ఉంది. కాకినాడ కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నం చేసినట్టు సమాచారం.రాజమండ్రిలోని ఇంటికి సంబంధించి ఆమె ఆత్మహత్యాయత్నం చేయలేదని, రాజాంలో స్థలం కోసం చేసి ఉంటారని స్థానిక పోలీసులు వెల్లడించారు. భార్యాభర్తలు మానసికంగా అసమతుల్యంగా ఉన్నారని పేర్కొన్నారు.


కొత్త ఇంటి నిర్మాణంలో యజమానికి విద్యుదాఘాతం 8




జిల్లా ఆసుపత్రిలో చిన్నారిని ముద్దాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

# జీజీహెచ్ వైద్య సేవల్లో తేడా వస్తే ఊరుకోను

- నెలకూ రెండు సార్లు తనిఖీ చేస్తా
- జిల్లా ఆసుపత్రి పరిశీలనలో ఎమ్మెల్యే వాసు


రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 25 : ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆదేశించారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో మంచి వైద్యం అందుతుందని దూరప్రాంతాల నుంచి ఎంతో నమ్మకంతో వచ్చే పేదలు, మధ్యతరగతి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలందించాలన్నారు. ఎక్కడైనా తేడా వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జీజీహెచ్‌లో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. ఓపీ రోగుల విషయంలో రిజిస్ట్రేషన్లు ఆలస్యం కావడం సరికాదని, ఆన్‌లైన్ కోసం సర్వర్ పనిచేయకపోతే మాన్యువల్‌గా రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలన్నారు.పేపర్‌మిల్లు, ఇతర సంస్థల సహకారంతో సీఎస్ఆర్ నిధులు తీసుకొచ్చి టెస్టింగ్, ఇతర వైద్య పరికరాలకు కొరత లేకుండా చూస్తామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రభుత్వానుపత్రికి వచ్చి రోగులకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయో పరిశీలిస్తామని, రోగుల సమస్యలు తెలుసుకుంటామని ప్రకటించారు. జీజీహెచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నా రిలీవ్ చేయడంలేదని, వెంటనే తమకు పోస్టింగ్‌లు ఇప్పించాలని నర్సింగ్ ఉద్యోగినులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కోరగా వెంటనే ఆయన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడి విషయం వివరించారు. ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది తమ జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.ఓపీ విభాగంలో పనిచేస్తున్న డీఈవోలు తమకు ఉద్యోగభద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ, డిప్యూటీ సూపరింటెండెంట్ కృష్ణంరాజు, ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మరుకుర్తి రవియాదవ్, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, యండమూరి దీపు, దాస్యం ప్రసాద్, నాయకులు బేసరి చిన్ని, నాగలక్ష్మి, మంత్రమూర్తి రాంబాబు, జగదీష్, కాశీ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

### రోగులతో మాట్లాడిన వాసు..

ఓపీ, సీటీ స్కాన్, వార్డులు, ఎంసీహెచ్ బ్లాకుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. పలువురు రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవజాత శిశువుల ఆరోగ్య పరిస్థితులను ఆరా తీసి వారి కుటుంబీకులతో మాట్లాడారు. రోగులకు అందజేసే ఆహార పదార్థాలను పరిశీలించి వాటిని రుచి చూశారు. ఆసుపత్రిలో పాలనాపరమైన చిన్నపాటి లోపాలు ఉన్నాయన్నారు. కొంత సమన్వయం కొరవడిందని, వాటన్నింటినీ పరిష్కరించుకుంటూ వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.ఆసుపత్రి అవసరాలకు తగ్గట్టుగా వైద్య సిబ్బంది నియామకం విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. మాజీ సీఎం జగన్ ప్యాలెస్‌ల పిచ్చి పరాకాష్టకు చేరిందని, వైసీపీ పార్టీ కార్యాలయాల పేరుతో జిల్లాకో ప్యాలెస్ కట్టడమే దీనికి నిదర్శనమన్నారు.

# కూటమిగా.. శ్రమదానం

గత వైసీపీ పాలకులను సమస్యను పరిష్కరించమని ఐదేళ్లు అడుగుతూనే ఉన్నారు.. అయినా పరిష్కారం లేదు.. ప్రమాదాలు జరుగుతున్నాయన్నా పట్టించుకున్న వాడూ లేడు.. అయితే కూటమి నాయకులకు ప్రజానీకం సమస్యను విన్నవించారో లేదో.. తెల్లవారేసరికి పరిష్కరించారు..శెహబాస్ అనిపించుకున్నారు.. నిడదవోలు నరసాపురం రోడ్డు నుంచి పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామంలోకి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉండవలసిన కల్వర్టు లేకపోవడంతో తరచూ పలు ప్రమాదాలు జరిగాయి. ఈ సమస్యను గ్రామస్థులు కూటమి నాయకులకు తెలిపారు. దీనిపై స్పందించిన నాయకులు మంగళవారం ఉదయం నుంచి శ్రమదానం చేసి కల్వర్టు నిర్మించారు. సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రజానీకం అభినందించారు. -పెరవలి



కూటమి నాయకులు శ్రమదానంతో నిర్మించిన కానూరు అగ్రహారం కల్వర్టు..



కల్వర్టు వద్ద శ్రమదానం చేస్తున్న నాయకులు

# కదలరు.. సీటు వదలరు!



## కంట్రోల్ తప్పుతోన్న రాజమహేంద్రవరం కార్పొరేషన్

**నాకు కార్పొరేషన్‌లో పని ఉండి ఒక ఉన్నతాధికారిని కలిశా.. పనిపూర్తవలేదు.. అయితే ఒక కిందిస్థాయి ఉద్యోగిని కలిశా.. నా పనికో రేటు చెప్పాడు.. అది చెల్లించా నా పనిపూర్తయిపోయింది.. ఎందుకంటే అక్కడ ఆయన 20 ఏళ్లుగా పనిచేస్తున్నాడు.. కార్పొరేషన్‌కు సంబంధించి మనకు ఒక చానల్ దొరికింది.. ఏ పనైనా ఇట్టే చక్కబెట్టేస్తాడు.. ఇదీ ఒక ఒక వ్యక్తి చెప్పిన మాట.. నిజమే మరి.. 20 ఏళ్లుగా ఒక చోటే పనిచేస్తుంటే చక్రం తిప్పక మరేం చేస్తాడు... ప్రస్తుతం రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో ఇదే పరిస్థితి.. బదిలీలు లేకపోవడంతో సుమారు 80 మంది అక్కడే తిష్టవేసి అంతా మా ఇష్టం అంటున్నారు.. ఏమైనా అంటే లోకల్ అంటున్నారు.. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.**

- 20 ఏళ్లు పైబడి ఒకే సీటులో తిష్ట
- పాతుకుపోయిన ఉద్యోగులు
- ఇష్టారాజ్యంగా మారిన వైనం
- బదిలీలు లేకపోవడమే కారణం
- ఒక్క రాజమండ్రిలోనే 80 మంది
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్
- గతంలో బదిలీల జీవోకు యత్నం
- ప్రభుత్వం మారడంతో కదలని ఫైలు
- ఈ సారైనా కదులుతుందని ఆశ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 25 : పాలకులు మారతారు..ఉన్నతాధికారులు మారతారు.. కొంత మంది అధికారులు మాత్రం పాతుకుపోయారు..కుర్చీలకు అతుక్కుపోయారు.. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 20 ఏళ్లగా ఇదే పరిస్థితి.. ఎవరు చెప్పినా వినరు.. వారు చెప్పిందే వినాలి. ఎందుకంటే సీటుబలం.. కనీసం ఉన్నతాధికారుల మాటను లెక్కచేయరు.. ఇదీ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో దుస్థితి.

### కార్పొరేషన్‌లో 300 మంది సిబ్బంది..

కార్పొరేషన్‌లో చాలా మంది ఉద్యోగులు ఏళ్ళతరబడి ఎటువంటి బదిలీలు లేకుండా పాతుకుపోయారు. ప్రభుత్వాలు మారినా..పాలక మండళ్లు మారినా.. ప్రజాప్రతినిధులు మారినా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో పనిచేసే కొంత మంది ఉద్యోగులు మాత్రం ఇక్కడ జాయినై ఇక్కడే ఉండిపోయారు. నగరపాలక సంస్థలో మొత్తంగా 300 మంది సిబ్బంది ఉంటారు. వీరిలో సుమారుగా 20 ఏళ్లుగా 30 మంది.. గత పది.. పదిహేనేళ్లుగా 50 మంది పాతుకుపోయారు.కనీస బదిలీలు కూడా వీరికి లేకపోవడంతో కార్పొరేషన్‌లోనే విభాగాలు మారుతూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఆయా విభాగాల హెచ్‌వోడీలుగా ఉండే 10 మంది మాత్రమే ఇతర మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు బదిలీ అవుతుంటారు. హెచ్‌వోడీలు మారినా స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న కిందిస్థాయి సిబ్బందికి బదిలీలు లేకపోవడంతో వచ్చిన ఉన్నతాధికారులు వారినే ఫాలో అవుతుంటారు.దీంతో అధికారం ఇష్టారాజ్యంగా మారుతోంది.

### కార్పొరేషన్ టు కార్పొరేషన్ బదిలీల్లేవ్..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆర్‌వోలు, ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, గుమస్తాలకు బదిలీలులేవు. దీంతో ఏళ్ల తరబడి ఉద్యోగులు నగరపాలక సంస్థల్లో తిష్ట వేసుకుని కూర్చున్నారు.కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లు,డిప్యూటీ కమిషనర్లు, ఎస్ఈలు, సీపీలు, ఏసీపీలు ఈఈలు, డీఈలకు మాత్రమే బదిలీ ఉంటుంది.ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ విభాగాల్లో హెచ్‌వోడీలుగా ఉన్నవారికి మాత్రమే బదిలీలు ఉంటాయి. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కొంత మంది బదిలీలు వచ్చినా వెళ్లకుండా గతంలో నిలుపుదల చేయించుకున్నారు. కొంత మంది ఉద్యోగులు 20 ఏళ్లగా ఒకే సీటుకు పరిమితమై చక్రం తిప్పుతున్నారు. కార్పొరేషన్‌లో బదిలీలు ఉన్నా కార్పొరేషన్ లోపల విభాగాల్లో సీట్లు మారతారు తప్ప వేరొక చోటుకు బదిలీ ఉండకపోవడంతో ఆడిందే ఆట అన్న చందాన కార్పొరేషన్‌లో కొంత మంది ఉద్యోగుల తీరు ఉంది. సీనియర్ అసిస్టెంట్స్, ఆర్‌వోలు, ఆర్‌ఐలు, అకౌంటెంట్, ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగుల బదిలీలకు చోటే లేకుండా పోయింది. చాలా వరకు కారుణ్య నియామకాలు ఉన్నాయి. ఇక్కడే ఉద్యోగంలో చేరిన వారు ఇక్కడే పదవీ విరమణ పొందే పరిస్థితి ఉంది. దీంతో ఇష్టానుసారం పనిచేస్తున్నారు. అనేక ఆరోపణలు ఉన్న ప్పటికి ఏమీ చేయలేని పరిస్థితి ఉంది.ఈ జాబితాలో గత ఐదేళ్లుగా వైసీపీ ప్రజాప్రతినిధులతో అంటకాగిన కార్పొరేషన్ సిబ్బంది చాలా మంది ఉన్నారు. కానీ ఇక్కడ బదిలీలు లేక ప్రక్షాళన సాధ్యం కావడంలేదు.

### గతంలో బదిలీ జీవో తేవాలని యత్నం..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న హెచ్‌వోడీలు మినహా మిగిలిన కీలకమైన స్థానాల్లో పనిచేస్తున్న అధికారులు, గుమస్తాలకు బదిలీలు లేవు. దీంతో కార్పొరేషన్‌లో ప్రక్షాళన జరగడంలేదని గుర్తించిన గత మేయర్ పంతం రజనీ శేషసాయి కార్పొరేషన్ నుంచి కార్పొరేషన్‌కు కొంత మందిని బదిలీ చేసే జీవో తీసుకురావాలని ప్రయత్నించారు. అప్పటి పురపాలక శాఖమంత్రి నారాయణతో పాటు డీఎంఏను కలిసి రిప్రజెంటేషన్ ఇచ్చారు.అటుపై ప్రభుత్వం మారడంతో కార్యరూపం దాల్చలేదు.ఎప్పట్నుంచో కీలకస్థానాల్లో ఉన్న వారిని బదిలీ చేయాలనే ఆలోచన ముందుకు సాగలేదు.

### పాలకుల ప్రసన్నంతో సరి..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో తిష్ట వేసుకుని ఉన్న కొంతమంది ఉద్యోగుల బదిలీలు ఈ సారైనా సాధ్యమా అనే అనుమానాలు కలుగుతున్నాయి. కార్పొరేషన్‌లో కీలకస్థానాల్లో ఉన్న కొంత మంది ప్రభుత్వాలు మారినప్పుడల్లా వారి సీటు పదిలం చేసుకుంటున్నారు. ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుని వేటు పడకుండా జాగ్రత్త పడుతున్నారు. అయితే ప్రజలకు మెరుగైన సేవలందించే క్రమంలో కూటమి ప్రభుత్వం ఎటు వంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి. నిస్వార్థంగా ప్రజలకు సేవలందించే ఉద్యోగులతో ఆ విభాగం ప్రగతి పథంలో ఉంటుంది.కానీ పైరవీలకు పాల్పడే అక్రమార్కులను సంస్కరించకపోతే ఆ ప్రభావం ప్రభుత్వం పై పడే ప్రమాదం ఉంది. కార్పొరేషన్ నుంచి వేరొక కార్పొరేషన్‌కు ఉద్యోగులను బదిలీలు చేసేవిధంగా జీవోను తీసుకువచ్చి ప్రక్షాళన చేస్తుందా. లేక పాతవిధానంలోనే ముందుకు సాగుతుందా చూడాల్సి ఉంది.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



## కూటమి విజయోత్సవ ర్యాలీ



పోతవరంలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, జూన్ 25: పోతవరం, ప్రకాశరావుపాలెం గ్రామాల్లో కూటమి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పోతవరంలో మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్ ఇంటికి వెళ్లారు. అలాగే సచివాలయ, వైద్య, ఆశ, అంగన్‌వాడీ ఉద్యోగులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేశారు. అనంతరం ప్రారంభమైన ర్యాలీ గ్రామ పురవీధుల్లో కొనసాగింది. ఎమ్మెల్యే మద్దిపాటి స్వగ్రామం ప్రకాశరావుపాలెంలో ఉప సర్పంచ్ యద్దనపూడి బ్రహ్మరాజు ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, ఏలేటి సత్యనారాయణ(జేడీ), పసుమర్తి ప్రభాకరావు, గన్నమనేని వెంకటేశ్వరరావు, పసుమర్తి కృష్ణ, అబ్బూరి నరేష్, కొండేపాటి శేషగిరి, కొండేపాటి సురేంద్ర, పిచ్చుకుల ధర్మాజీ, ప్రత్తిపాటి కృష్ణ, బీజేపీ మండలాధ్యక్షుడు చెల్లు సత్యనారయణ, జనసేన నియోజక వర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు, మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, అచ్యుత సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రకాశరావుపాలెంలో కార్యకర్తలకు, నాయకులకు భోజనాలు నిర్వహించారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందించిన యోగా మాస్టర్, ఉపాధ్యాయులు

తాళ్ళపూడి, జూన్ 25 వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. యోగా డే సందర్భంగా వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో ఆసనాలు, ఏకాగ్రత, అంకెల జ్ఞాపకశక్తి వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు యోగా మాస్టర్ నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంఈవో బాలామణి బహుమతులు అందించారు. గాయిత్రీ యోగా సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా యోగా నేర్పుతున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ వినియోగించుకోవాలని యోగా మాస్టర్ చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గౌరవ డాక్టరేట్ గ్రహీత పాండుకు సత్కారం

నిడదవోలు, జూన్ 25: తాడిమళ్ల జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు విప్పర్తి ఐజాక్ న్యూటన్ పాండుకు హరియాణాలోని ఎంబీఆర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. దీంతో మంగళవారం నిడదవోలులోని తహశీల్దార్ కార్యాలయంలో పాండును ఘనంగా సత్కరించారు. తహశీల్దార్ వి.నాగభూషణం మాట్లాడుతూ పాండు ఉపాధ్యాయుడిగా, యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్‌గా, నిడదవోలు టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారని, విద్య, సామాజిక, సేవా రంగాల్లో ఆయన అందిస్తున్న సేవలకు గౌరవ డాక్టరేట్ రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్, కార్యదర్శి షరీఫ్ పలువురు ఉపాధ్యాయులు అయనను అభినందించారు.

## మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

### సీఐటీయూ నాయకుడు జువ్వల రాంబాబు



మున్సిపల్ కమిషర్ రామ్‌భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నిడదవోలు, జూన్ 25: ఐదేళ్ళుగా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ నాయకుడు జువ్వల రాంబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం నిడదవోలులోని మున్సిపల్ కార్యాలయంలో కమిషర్ టి.రామ్‌భూపాల్‌రెడ్డికి ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పట్టణం విస్తీర్ణానికి అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెరగలేదని, దీనితో పనిభారం బాగా పెరిగిపోయిందన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అందించడంలో కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తూరుగోపు చిరంజీవి, బొచ్చా సాయిరమణ, బొరిశెట్టి కొండ, బంగారు రాజేష్, కాకి రాజు, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వినియోగంతో నష్టాలపై అవగాహన



కొవ్వూరు, జూన్ 25: డ్రగ్స్, మాదకద్రవ్యాలకు బానిసలై యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కొవ్వూరు ఎస్‌ఈబీ సీఐ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వేద సంస్కృత కళాశాలలో ప్రిన్సిపాల్ డి.గౌరీశంకర్ అధ్యకతన మంగళవారం డ్రగ్స్, మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పలువురు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## సీహెచ్‌సీలో దోమల మందు పిచికారీ

గోపాలపురం, జూన్ 25: ఆసుపత్రికి పారిశుధ్య, మౌలిక వసతుల కల్పనలో దాత, వేళ్లచింతలగూడెం గ్రామానికి టీడీపీ నాయకుడు గన్నమని చిట్టిబాబు అందిస్తున్న సహకారం అభినందనీయమని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చైతన్యరాజు అన్నారు. చిట్టిబాబు ఆర్థిక సాయంతో సమకూర్చిన చెదలు, దోమల మందును ఆసుపత్రిలో మంగళవారం పిచికారీ చేశారు. వైద్యాధికారి చైతన్యరాజు మాట్లాడుతూ చిట్టిబాబు సొంత నిధులతో గతంలో ఆసుపత్రికి మూడు వాటర్‌ట్యాంకులు, బీపీ మీటర్ అందించారని, పోస్టుమార్టం షెడ్డు, లెవిలింగ్ పనులు చేయించారని, సెప్టిక్ ట్యాంకుల శుభ్రం చేయిస్తున్నారన్నారు.

## 1770 కిలోల రేషన్ బియ్యం గోల్‌మాల్



కరగపాడులో డీలర్ నుంచి సంతకాలు సేకరిస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు

గోపాలపురం, జూన్ 25: మండలంలోని కరగపాడు, బుచ్చయ్యపాలెం షాప్ నెంబరు 33పై సివిల్ సప్లై అధికారులు మంగళవారం మెరుపుదాడి చేశారు. ఈ దాడుల్లో 35బస్తాలకు సంబంధించి 1770 కిలోల రేషన్ బియ్యం గోల్‌మాల్ అయినట్టు గుర్తించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై అధికారులు టి.దివాకర్, ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ షాప్ నెంబరు 33లో రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరగడం లేదని ఒక అజ్ఞాత వ్యక్తి డీఎస్‌వోకు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు తనిఖీలు నిర్వహించి 1770 కిలోల బియ్యం గోల్‌మాల్ అయినట్లు గుర్తించామన్నారు. సంబంధిత డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసి వీఆర్వో గోతియ్య సమక్షంలో షాపు సీజ్ చేసినట్టు తెలిపారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.

## నేటి నుంచి సుందర గోవిందుడి బ్రహ్మోత్సవాలు

కొవ్వూరు, జూన్ 25: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సుందర గోవిందుని బ్రహ్మోత్సవాలు ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు గోపూజ, మంత్ర జపాలు, చండీ పారాయణం, జరుగుతుందన్నారు. 26న లక్ష్మీ గణపతి హోమం, 27న సుబ్రహ్మణ్య షడావరణ అర్చన, 28న సుబ్రహ్మణ్య చండీ హోమాలు, 29న శ్రీవారి కళ్యాణం, తులసీ పూజ, 1,116 కుంభ స్థాపన, అర్చన, 30న పూర్ణాహుతి, కుంభాభిషేకం, శిఖరపూజ, స్వస్తి, భక్తులకు అన్నదానం జరుగుతాయని చెప్పారు.

# గ్రామాలకు గోదావరి జలాలు అందిస్తాం

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం

కొవ్వూరు, జూన్ 25: ప్రతి గ్రామానికి తాగడానికి గోదావరి ఉపరితల జలాలు అందించానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి 9గంటలు అందించే విద్యుత్‌ను ఉదయం 5గంటలకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పంచాయతీలో వీధి దీపాలు వెలిగించాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్యం మెరుగుపర్చాలి, డ్రైనేజీలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర గల్లా పెట్టెను పూర్తిగా ఖాళీ చేసిందని, కొత్తగా ప్రభుత్వం ఏర్పడి నందున బడ్జెట్ కేటాయించే వరకు గ్రామీణ ప్రాంతాల్లో దాతల సహకారం తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ని ఐదు ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును కోరామన్నారు. మున్సిపాల్టీలో టిడ్కొగృహాలు, నూతనంగా అందించిన ఇళ్ల కాలనీల్లో పర్యటించి సమస్యలు గుర్తించామన్నారు. 2014-19 కాలంలోనే గోదావరి ఉపరితల జలాలు గ్రామాలకు అందించడానికి ఆలోచన చేశామని, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వాటన్నింటికి తిరిగి ఎస్టిమేట్‌లు వేయించి గ్రామాలన్నింటికి గోదావరి జలాలలను అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్, సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.వైసీపీ ప్రభుత్వంలో నిధుల్లేక సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా ఉండిపోయారని, కూటమి ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధులందించి గ్రామాల అభివృద్ధికి పాటుపడతామన్నారు.ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, సూరపనేని చిన్ని, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, యూఆర్ మునిప్రసాద్, బేతిన నారాయణ, యలమర్తి రాంబాబు, కాకర్ల బ్రహ్మాజీ, ఎంపీడీవో కె.సుశీల, తహశీల్దార్ కె.మస్తాన్, ట్రాన్స్‌కో ఏడీ పి.అచ్యుతాచారి, ఏడీఏ పి.చంద్రశేఖర్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### తాళ్లపూడి మండల పరిషత్ ఆర్థిక పరిస్థితి హీనం

తాళ్ళపూడి, జూన్ 25: తాళ్లపూడి మండల పరిషత్ ఆర్థిక పరిస్థితి పంచాయతీల కంటే హీనంగా ఉందని, మండలాన్ని అభివృద్ధిలోకి తీసుకురావడానికి పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పనిచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జిల్లా పరిషత్ నుంచి మండలానికి జమయ్యే సీనరేజి కూడా రాష్ట్ర ప్రభుత్వం జమ చేసుకోవడమేమిటని, పంచాయతీలకు నిధుల్లేకుండా చేయడం దారుణమన్నారు. ఎన్నికల ప్రచారంలో తిరిగినప్పుడు అనేక సమస్యలు గుర్తించానని చాలా గ్రామాల్లో రహదారులు పాడైపోయాయన్నారు. ప్రజాప్రతినిధులుగా అవకాశమిచ్చిన ప్రజలే అభివృద్ధి కోసం పనిచేయకపోతే పాతాళానికి తొక్కుతారనడానికి ఇటీవల జరిగిన ఎన్నికలే ఉదాహరణ అని ఎమ్మెల్యే అన్నారు. ముందుగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమస్యలపై చర్చించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. రావూరుపాడు ఎంపీటీసీ వీరా హరిబాబు ఏర్పాటు చేసి కేకును ఎమ్మెల్యే కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణతోపాటు పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి

### జనసేన మండలాధ్యక్షుడికి పరామర్శ

అనారోగ్యం నుంచి కోలుకున్న జనసేన మండలాధ్యక్షుడు గంటా కృష్ణను ఎమ్మెల్యే ముప్పిడి తాడిపూడిలో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వేగేశ్వరపురం జనసేన నాయకుడు దేవన సత్యనారాయణ, జనసైనికులు కలిసి అభినందనలు తెలిపారు.

## రైస్‌మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కొవ్వూరు, జూన్ 25: రైస్‌మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు యువరాజ్ కల్యాణ మండపంలో జరిగిన రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. రైతులు, రైస్‌మిల్లర్లు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఐదేళ్లలో ధాన్యం కొనే నాథుడు లేక జాతీయ రహదారుల వెంబడి కుప్పలు కుప్పలుగా పోసి రాత్రింబవళ్లు కాపలా ఉండి ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రతిసారి పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు వచ్చి ధాన్యం తడిసి నష్టం వాటిల్లుతుందన్నారు. ఆ సమయంలో గత ప్రభుత్వం ఎటువంటి భరోసా కల్పించకపోవడంతో నానా అవస్థలు పడ్డారన్నారు. రైతులు, రైస్‌మిల్లర్ల సమస్యలను రాతపూర్వకంగా అందిస్తే జిల్లా కలెక్టర్, సంబంధిత మంత్రి, అవసరమైతే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో జనార్ధన్, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, మట్టే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శాంతి
- పలుచోట్ల స్టాప్ డయేరియా క్యాంపెయినింగ్



నిడదవోలులో మాట్లాడుతున్న డీడీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శాంతి

నిడదవోలు, జూన్ 25: పరిసరాల పరిశుభ్రతతో అనేక వ్యాధులు దరిచేరకుండా చేయవచ్చునన్నారు జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ శాంతి అన్నారు. మంగళవారం నిడదవోలులోని మున్సిపల్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ అధికార్లతో కలిసి స్టాప్ డయేరియా క్యాంపేయినింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని, డయేరియాపై అందరూ అవగాహన కలిగి ఉండాలని న్నారు. సమావేశంలో డాక్టర్ హేమలత, మున్సిపల్ కమిషర్ టి.రామ్‌భూ పాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్, హెల్త్ అసిస్టెంట్ జి.ప్రసాద్ పాల్గొన్నారు.

**గోపాలపురం:** మండలంలోని గుడ్డిగూడెం గ్రామంలో అతిసార వ్యాధి నియంత్రణలో భాగంగా మలాతిన్ మందును మంగళవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మడిచర్ల ప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం రూపొందింతుందని అన్నారు. ప్రతిఒక్కరు చెత్త నిర్వహణ సక్రమంగా పాటించాలని, పంచాయతీ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే చెత్త వేయాలన్నారు. వర్షాకాలం కారణంగా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో హుకుంపేట ఎంపీహెచ్‌ఏ క్షేత్రిమూర్తులు, కార్యదర్శి సురేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలపురం: గుడ్డిగూడెంలో మలాథియాన్ పిచికారీ

# 'విగ్రహం' సమస్య శాంతియుత పరిష్కారానికి కృషి

- కొవ్వూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

పెరవలి, జూన్ 25: ఖండవల్లిలో వేంకటేశ్వర స్వామి విగ్రహం తొలగించడంలో ఎటువంటి దురుద్దేశం, కుట్రలు లేవని, ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించడానికి కృషి చేస్తామని కొవ్వూరు డీఎస్పీ కె.శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. పెరవలి పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే నెల 10న ఖండవల్లి కనకదుర్గమ్మ గుడి సమీపంలోని మార్కెట్‌యార్డు స్థలంలో గ్రామానికి చెందిన ఆనంద్, వీర గణపతి, కూనపరెడ్డి పెద్దకాపు, కవులూరి ఉమామహేశ్వరరావు, మరికొందరు కలిసి వేంకటేశ్వర స్వామి విగ్రహం ఏర్పాటు చేశారని తెలిపారు. ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా విగ్రహం పెట్టడంతో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమో దు చేశామన్నారు. ఈ విగ్రహం ఏర్పాటు విషయంలో కనకదుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారని, వేరొక చోట స్థలం కొని అక్కడ గుడి కట్టించి విగ్రహం పెడదామని కమిటీ సభ్యులు, విగ్రహం పెట్టిన వారు కలిసి రెండు సార్లు సమావేశమయ్యారని కాని ఈ వివాదం పరిష్కారం అవ్వలేదని తెలిపారు. ఇదిలా ఉండగా జూన్ 23వ తేదీ రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ విగ్రహం తీసి రైతు భరోసా కేంద్రం వద్దకు తరలించారని, ఈ క్రమంలో విగ్రహంలో కొంతభాగం దెబ్బతిందన్నారు. దీనికి సంబంధించి రాజకీయ పార్టీలకు, మతపరమైన వివాదాలకు గాని ఆస్కారం లేదని, గ్రామస్థుల సమక్షంలో ఈ సమస్యను పరిష్కరిస్తామని అంతవరకు ఎటువంటి వదంతులు ప్రచారం చేయరాదని డీఎస్పీ చె ప్పారు. సమస్య పరిష్కారమయ్యే వరకు అక్కడ పోలీసు పిక్కెట్ ఏర్పాటు చేశారన్నారు. సమావేశంలో సీఐ జానకిరామయ్య, ఎస్‌ఐలు మూర్తి, అజ్జలరాజు పాల్గొన్నారు.

## కొత్త ఇల్లు నిర్మాణంలో విద్యుదాఘాతంతో మృతి



మృతుడు బంగార్రాజు

అనపర్తి, జూన్ 25: అనపర్తి మండలం కుతుకులూరులోని కూటేశ్వర కాలనీలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రామా రావు, బంధువుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బంగార్రాజు (32) కూటేశ్వర కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్నాడు. మంగళవారం పని జరుగుతున్న ప్రదేశంలో ఇసుక జల్లించుకునేందుకు ఏర్పాటు చేసిన యంత్రం వైరు జాయింటు వద్ద వేసిన ప్లాస్టర్ ఊడి పోయి ఉండడం గమించని రాజు వైరుపై కాలు వేయడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు బంధువులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే రాజు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న బంధువులు రాజు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరయ్యారు. రాజు సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

గోకవరం, జూన్ 25: బైక్ అదుపు తప్పి గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన చంద్రు రమణ(29) మంగళవారం మృతి చెందాడు. రమణ తన వ్యక్తిగత పనులు ముగించుకొని గోకవరం నుంచి స్వగ్రామమైన కామరాజుపేటకు బైక్‌పై వెళ్తుండగా గోకవరం గ్రామ శివారున అదుపు తప్పి కింద పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

## పాత వెలుగుబందలో చోరీ

రాజానగరం, జూన్ 25: మండలంలో పాతవెలుగుబంద గ్రామం జగనన్న కాలనీలోని సోమవారం రాత్రి ఓ ఇంట్లో దొంగలు ప్రవేశించి బంగారు ఆభరణాలు, వెండి సామగ్రితో పాటు నగదును దోచుకున్నారు. కాలనీకి చెందిన బర్ల భవాని ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఇంట్లో భద్రపర్చిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతోపాటు రూ.20 వేలు నగదు అపహరణకు గురైనట్టు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

## కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కొవ్వూరు, జూన్ 25: కొవ్వూరులోని బసివిరెడ్డిపేటలో రాజలక్ష్మి గోదా సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయార్చకులు స్వామి వారికి మహా నీరాజనాలు, పంచామృత, సహస్ర కళాశాభిషేకాలు చేశారు. దేవగుప్తాపు లక్ష్మణరావు, పద్మావతి దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వహింపజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## అంబేడ్కర్, సీఎం చిత్రపటాలకు పాలభిషేకం



వేలివెన్నులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, మే 25: జగనన్న విదేశీ విద్య పథకం పేరును అంబేడ్కర్ విదేశీ విద్యగా మార్చు చేయడం పట్ల పలువురు ఎస్సీ నాయకులు అంబేడ్కర్, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. మండలంలోని వేలివెన్నులో టీడీపీ నియోజవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జరగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు విచ్చేసి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నట్లు చెప్పారు. విదేశీ విద్య పేరును మార్చిన గత ప్రభుత్వం దళితుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వెంటనే అంబేడ్కర్ విదేశీ విద్యగా మార్చారన్నారు. పలువురు దళిత నాయకులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. శేషారావును సత్కరించారు. కార్యక్రమంలో నేకూరి గనిరాజు, చెట్టే సుజనరావు, పాతూరి నరేంద్రబాబు, దిద్దే మదుబాబు, చదలవాడ లక్ష్మీనారాయణ, నియోజకవర్గంలోని ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



రంగంపేట, జూన్ 25: బాలికల అక్రమ రవాణా, హక్కులు, బాల్యవివాహాలు, పోక్సో, పీసీపీఎన్‌డీటీ చట్టాలపై అవగాహన పెంచుకొని, వాటి అమలు ద్వారా రక్షణ పొందడానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీఫ్లోరెన్స్ సూచించారు. మంగళవారం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి అధ్యక్షతన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చదువుతో పాటు సంస్కారం, సంస్కృతిని అలవర్చుకోవాలని, కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవడానికి బాలికలు చైతన్యవంతులు కావాలని సూచించారు. ఉన్నత విద్య, ఉత్తమ కుటుంబ బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని హెచ్ఎం సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగ సామాజిక కార్యకర్త కె.శిరీష, సూపర్‌వైజర్లు వాణి, బేగం, పలువురు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

## జాగ్రత్తలు తీసుకోవాలి: ఎంపీపీ ప్రసాద్

కడియం, జూన్ 25: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చాలా అవసరమని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, మంచి నీటి ట్యాంకుల్లో ఎప్పటికపుడు క్లోరినేషన్ చేయాలని, క్వాలిటీ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. గ్రామాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేయించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎన్.జెస్సీ సుప్రియ, డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న, ఈవోపీఆర్‌డీ విక్టర్‌బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శివకుమార్, ఆరోగ్య విస్తరణాధికారి ఎంవీవీ రామకృష్ణ, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## కొద్దిపాటి మెలకువలతో నాణ్యమైన దిగుబడులు

### ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు

అనపర్తి, జూన్ 25: శాస్త్రీయ వ్యవసాయ విధానాలను అవగాహన చేసుకుని కొద్దిపాటి మెళుకువలు పాటిస్తే స్థిరమైన, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మంగళవారం అనపర్తిలోని రైతు భరోసా కేంద్రంలో ఏరువాక ఆధ్వర్యంలో ఏడీఏ కృష్ణ అధ్యక్షతన జరిగిన రైతు సదస్సుకు ఆయన విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుతం సార్వాలో వరి నారుమడులు దశ కొనసాగుతోందని, కొన్ని చోట్ల నాట్లు ప్రారంభమయ్యాయన్నారు. నారు తీసే వారం ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటు నారు మడికి 160 గ్రాముల చొప్పున చల్లుకోవాలని, దీనివల్ల కాండం తొలిచే పురుగు నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. ప్రధాన మండిలో ఎరువులను సిఫారసు చేసి 36-24-24 కిలోల నత్రజని భాస్వరం పొటాష్ ఇచ్చే ఎరువులను వాడుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, హైమాజ్యోతి వరిలో కలుపు నివారణ విధానాలు, వరిలో రకాలు, మార్కెటింగ్, లాభదాయక పంటలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఆంజనేయుడికి 8 వేల బూర్లు



అనపర్తి, జూన్ 25: అనపర్తి ఎమ్మెల్యేగా కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధిస్తే కుతుకులూరు అభయాంజనేయ స్వామికి ఎనిమిది వేల బూర్లు నివేదిస్తామని గ్రామానికి చెందిన కూటమి నాయకులు పులగం శాంత, కొవ్వూరి రామారెడ్డి(మేస్త్రి), పులగం తిరుమల రెడ్డిలు మొక్కుకున్నారు. దీంతో మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బూర్లను సమర్పించారు. కార్యక్రమంలో నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే నల్లమిల్లి కలిసిన టీడీపీ నాయకులు

బిక్కవోలు, జూన్ 25: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని సోమవారం రాత్రి ఊలపల్లికి చెందిన పీహెచ్‌సీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కలిసారు. ఈ సందర్భంగా ఆయనతో కేకు కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో సురేష్, అశోక్, మహేష్, ఎన్‌డీఏ యూత్ పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, జూన్ 25: ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన అనంతరం తొలిసారిగా మద్దిపాటి వెంకట్రాజు మంగళవారం ద్వారకా తిరుమల చిన వెంకన్నను సందర్శించారు. ఆయనకు ఆలయంలో ఘనస్వాగతం లభించింది. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖమండపంలో దేవస్థానం ప్రధాన అర్చకులు పెద్దింటి అలహసింగరాచార్యులు నుంచి స్వామివారి శేషవస్త్రం, వేదాశీర్వచనం పొందారు. ఈవో వి.త్రినాథరావు ఆయనకు శ్రీవారి చిత్రపటాన్నిప్రసాదాలను అందించారు. ఆయన వెంట లంకా సత్యనారాయణ, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మొగతడకల శ్రీనివాసరావు, పోలిన శ్రీనివాసరావు, డీవీఎస్ చౌదరి, ఏపూరి దాలయ్య, తదితరులు పాల్గొన్నారు.